RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 131 | బుధవారం, జూన్ 26, 2024 | పేజీలు : 4

### మాజీ సీఎం కేసీఆర్‌కు మరోసారి నోటీసులు

హైదరాబాద్: తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు పవర్ కమిషన్ మంగళవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇప్పటి వరకు కమిషన్‌కు అందిన సమాచారంపై తన అభిప్రాయాన్ని తెలియజేయాలని విద్యుత్ కమిషన్ తన నోటీసుల్లో కేసీఆర్‌కు స్పష్టం చేసింది. ఇక జూన్ 27వ తేదీ లోపు ఈ అంశంపై వివరణ ఇవ్వాలని సదరు నోటీసుల్లో సూచించింది. అలాగే ఇదే అంశంపై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డితోపాటు మరికొంత మందికి సైతం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

## ఆరోగ్య మిషన్ నిదుల విడుదల చేయండి...

# నడ్డాకు రేవంత్ వినతి



న్యూఢిల్లీ: కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) 2023-24 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ.323.73 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా.. ఎన్‌హెచ్ఎంలో 2024-25 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ.231.40 కోట్లు మంజురు చేయాలని కోరారు. ఎన్‌హెచ్ఎంకు సంబంధించి కేంద్రం నుంచి రావల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా.. సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన వాటా మొత్తాన్ని 2023 అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్‌హెచ్ఎం కింద తెలంగాణకు రావల్సిన పెండింగ్ నిధులు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## విపక్ష నేతగా రాహుల్ గాంధీ..!



న్యూఢిల్లీ: అధికార బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ కూటమితో పోరాడేందుకు లోక్‌సభలో విపక్ష నేతగా రాహుల్ గాంధీ బాధ్యతలు చేపడతానని తెలిపారు. ఇంతకుముందే లోక్‌సభలో విపక్ష నేతగా రాహుల్ గాంధీ ఉండాలని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానించింది. సీడబ్ల్యూసీ తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు. ఈ నిర్ణయాన్ని లోక్ సభ ప్రొటెం స్పీకర్ భర్తృహరికి లేఖ ద్వారా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీ తెలిపినట్లు సమాచారం. 18వ లోక్ సభ తొలి సమావేశాల్లో స్పీకర్ ఎన్నికకు కొన్ని గంటల ముందు రాహుల్ గాంధీ విపక్ష నేతగా వ్యవహరించనున్నట్లు ప్రకటించడం గమనార్హం. లోక్ సభ స్పీకర్ పదవికి ఏకాభిప్రాయంతో ఎన్నిక జరుగడం సంప్రదాయంగా వస్తోంది. ప్రతిపక్ష నేతకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తారు. కానీ విపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలన్న ప్రతిపాదనను అధికార ఎన్డీఏ కూటమి తిరస్కరించడంతో స్పీకర్ పదవికి పోటీ అనివార్యమైంది. బీజేపీ నుంచి మాజీ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ పార్టీ నుంచి కే సురేశ్ స్పీకర్ పదవి కోసం పోటీ పడుతున్నారు. బుధవారం లోక్ సభ స్పీకర్ పదవికి ఎన్నికలు జరుగుతాయి. దశాబ్దాలుగా లోక్ సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరుగనుండటం ఇదే తొలిసారి.

## ప్రజల కోసం ఫిర్యాదు బాక్సులు : మంత్రి అనిత



అమరావతి: ప్రజా సమస్యల పరిష్కారానికి నియోజకవర్గంలో ప్రత్యేక కంప్లైంట్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రతి మండల కేంద్రంలోని ఎంఆర్ఓ, ఎంపీడీఓ, కళాశాలలు, ప్రధాన కూడళ్లలో కంప్లైంట్ బాక్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మూడు, ఐదు రోజులకోసారి ఫిర్యాదుల పెట్టెను బయటకు తీసి వాటిని పరిశీలించి పరిష్కారానికి అధికారులకు పంపుతామన్నారు. అధికారులను మచ్చిక చేసుకుని అక్రమ లేఅవుట్లు, పేదల భూములను కబ్జా చేయడం వంటి ఘటనలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. నా పేరు చెప్పి పేదలకు ఇళ్లు, పింఛన్లు, ప్రభుత్వ పథకాలు అందిస్తామని డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయింపులు జరపాలని, అందుకు విరుద్ధంగా ప్రవర్తించే అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు.

### వెంకయ్యనాయుడుతో...

## ప్రధాని మోడీ భేటీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోడీ మంగళవారం మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడుతో భేటీ అయ్యారు. ఢిల్లీలోని త్యాగరాజ్ మార్గ్ లోని వెంకయ్యనాయుడు నివాసంలో మోడీ కలిశారు. ఈ సందర్భంగా ఇరువురూ జాతీయ ప్రయోజనాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ భేటీపై మోడీ ట్వీట్ చేశారు. తాను వెంకయ్యనాయుడును కలిశానని, ఆయనతో దశాబ్దాలుగా పనిచేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. భారతదేశ పురోగతి పట్ల ఆయన వివేకం, ఆసక్తి సర్వదా ప్రశంసనీయమని మోడీ అభివర్ణించారు. అలాగే ఈ భేటీపై వెంకయ్యనాయుడు ట్వీట్ చేశారు. మోడీ తన నివాసానికి వచ్చి కలిశారని, భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన మోడీకి ఈ సందర్భంగా నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## తెలుగులో ప్రమాణస్వీకారం చేసిన తమిళ ఎంపీ



న్యూఢిల్లీ: తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన లోక్ సభ ఎంపీ గోపి నాథ్ పార్లమెంటులో తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. లోక్ సభలో ఎంపీల ప్రమాణ స్వీకారం రెండో రోజూ కొనసాగుతోంది. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారు. అనేక మంది ఎంపీలు తమ మాతృ భాషలో ప్రమాణం చేశారు. తమిళనాడు, పుదుచ్చేరి కి చెందిన 40 మంది ఎంపీలు లోక్ సభ రెండో మధ్యాహ్నం 2.15 గంటలకు ఒక్కొక్కరుగా ప్రమాణస్వీకారం చేశారు. కాగా కృష్ణగిరి ఎంపీ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. తమిళనాడులోని కృష్ణగిరి ఆంధ్రప్రదేశ్ ను ఆనుకుని ఉంటుంది. ఇక్కడ తమిళులు ఎక్కువే అయినప్పటికీ, తర్వాతి స్థానాలలో తెలుగు, కన్నడ వారు అధికంగా నివసిస్తుంటారు. తమిళనాడు నుంచి బెంగళూరుకు వెళ్లే దారి మధ్యలో ఉంటుంది ఈ కృష్ణగిరి.

## స్పీకర్ పదవికి పోటీ పడుతున్న కొండికునాల్ సురేశ్



న్యూఢిల్లీ: లోక్ సభ స్పీకర్ పదవికి తొలిసారి పోటీ జరుగబోతున్నది. ఇదివరలో ఈ పోస్ట్ కు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలిసారి ప్రతపక్ష అభ్యర్థిగా కొండికునాల్ సురేశ్ పోటీపడుతున్నారు. కాగా ఎన్ డిఏ అభ్యర్థిగా ఓమ్ బిర్లా పోటీపడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ మధ్యాహ్నం 12.00 గంటలకు ముగిసింది. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తో మోడీ నేతృత్వంలోని ఎన్ డిఏ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ విషయంలో ఓ అంగీకారానికి రాలేకపోయింది. దాంతో స్పీకర్ పదవికి పోటీ నెలకొంది. 18వ లోక్ సభ తొలి రోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ సహా 262 మంది కొత్తగా ఎన్నికయిన ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా మిగతా 281 మంది కొత్త ఎంపీలు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగనున్నది. ఇదిలావుండగా ఇండియా బ్లాక్ కు చెందిన ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న నినాదాలతో, రాజ్యాంగం ప్రతులను పట్టుకుని నిరసన తెలిపారు. స్పీకర్ ఎన్నిక జూన్ 26న జరుగనున్నది. కాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ జూన్ 27 న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రక్రియ కొనసాగనున్నది. వచ్చే వారం ఉభయ సభలలో ప్రధాని మోడీ చర్చలపై సమాధానాలు ఇవ్వనున్నారు.



## నిరవధిక నిరాహార దీక్ష విరమించిన ఆతిషి

న్యూఢిల్లీ: ఢిల్లీ జల మంత్రి ఆతిషి మంగళవారం తన ఆరోగ్యం బాగా క్షీణించడంతో చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షను విరమించారని, ఆమెను ఆసుపత్రిలో చేర్పించినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. అంతేకాక ఆయన ఢిల్లీకి హర్యానా నుంచి సరైన వాటా నీళ్లను కేటాయించేలా ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాయనున్నట్టు కూడా తెలిపారు. సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు తెలిపారు. ఢిల్లీకి నీటి సంక్షోభం తలెత్తడంతో మంత్రి ఆతిషి జూన్ 21 నుంచి నిరాహార దీక్ష చేపట్టారు. ఆమె ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం ఆమెను ఆసుపత్రిలో చేర్చారు. ఆమె ఢిల్లీలోని లోక్ నాయక్ హాస్పిటల్ లోని ఐసియూ ఎమర్జెన్సీ లో ఉన్నారు. ఆమె రక్తంలో చక్కెర పాళ్లు పడిపోయాయి. గత ఐదు రోజులుగా ఆమె ఎలాంటి ఆహారం తీసుకోకపోవడంతో పరిస్థితి విషమంగా మారింది. "ఆమె త్వరగా కోలుకోవాలి" అని ఆప్ ఎక్స్ లో పోస్ట్ పెట్టింది.

## జులైలో రష్యా పర్యటనకు ప్రధానిమోడీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోడీ జులైలో రష్యాలో పర్యటించనున్నారని సమాచారం. భారత్రష్యా మధ్య వార్షిక చర్చల నిమిత్తం ఈ పర్యటన జరగనుంది. అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ వర్గాలను ఉటంకిస్తూ రష్యా అధికారిక మీడియా సంస్థ ఈ సమాచారం వెల్లడించింది. మోడీ పర్యటన విషయంలో రష్యా నుంచి బహిరంగ ఆహ్వానం ఉందని, పుతిన్‌తో ఆయన సమావేశం ఉంటుందని మార్చినెలలో క్రెమ్లిన్ వెల్లడించింది. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య నేపథ్యంలో భారత్ స్వతంత్ర వైఖరిని ప్రదర్శిస్తోంది. అమెరికా, ఐరోపా సమాఖ్య ఆంక్షలు ఉన్నప్పటికీ, మనం మాత్రం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే. భౌగోళిక, రాజకీయ పరిస్థితుల సంగతి ఎలా ఉన్నా మాస్కోఢిల్లీ మధ్య సంప్రదాయ స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతాయని గతం లోనే పుతిన్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ పరిణామాలపై తాను మోడీతో మాట్లాడానని చెప్పారు. ఈ సమస్యకు శాంతియుత పరిష్కారం దిశగా భారత ప్రధాని తనవంతు ప్రయత్నాలు చేస్తారని తనకు తెలుసన్నారు. అలాగే తన స్నేహితుడు మోడీని కలుసుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, ఆయన రష్యా వస్తే వర్తమాన అంశాలు, రెండు దేశాల సంబంధాల బలోపేతం గురించి మాట్లాడుకునే అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆయన దేశంలో పర్యటించాలని గతంలో ఆకాంక్షించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యం లోనే మోడీ పర్యటన ఉండనున్నట్టు తెలుస్తోంది.

## రాహుల్ టు అఖిలేష్...

### రాజ్యాంగ ప్రతితో ప్రమాణం చేసిన విపక్ష కూటమి ఎంపీలు

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ తొలి సమావేశాలు కొత్త పార్లమెంట్ భవనంలో విపక్షాల ఆందోళనల నడుమ కొనసాగుతున్నాయి. ఈ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజు 280 మంది ఎంపీలు లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీలతో ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రమాణం చేయించారు. రెండోరోజైన మంగళవారం కూడా మిగిలిన ఎంపీలు ప్రమాణం చేస్తున్నారు. అయితే, ఈ సమావేశాల్లో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రొటెం స్పీకర్ నియమించిన తీరుకు వ్యతిరేకంగా సమావేశాలు ప్రారంభం నుంచి విపక్ష కూటమి పార్టీల ఎంపీలంతా రాజ్యాంగ ప్రతుల తో సభలో నిరసన తెలుపుతున్నారు. అదేవిధంగా రాజ్యాంగ ప్రతులతోనే ప్రమాణ స్వీకారం కూడా చేస్తున్నారు. పోడియం వద్దకు వెళ్లి ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా కూటమి పార్టీల ఎంపీలంతా ఇదే విధానాన్ని ఫాలో అవుతున్నారు.



## సంపాదకీయం

# ఈ తీర్పు ఒక హెచ్చరిక

కుల గణనతో బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వం గత ఏడాది విద్య, ఉద్యోగ రంగాల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు 65 శాతానికి పెంచుతూ అమలులోకి తీసుకొచ్చిన నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు గురువారం కొట్టివేయడం నితీశ్ కుమార్ ప్రభుత్వానికి గట్టిదెబ్బ. ఇది రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కులగణనతో రిజర్వేషన్లు పెంచేందుకు బీహార్ ప్రభుత్వం తరహాలో సన్నాహాలు చేస్తున్న పార్టీలకు, ప్రభుత్వాలకు ఈ తీర్పు ఒక హెచ్చరిక. కులగణన నివేదికను గత ఏడాది నవంబరులో అసెంబ్లీలో బీహార్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

అదే సమయం లో విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లను పెంచుతూ సవరణ బిల్లు తీసుకు రావడం, సభ ఏకగ్రీవంగా ఆమోదించడం, గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడం ఇవన్నీ ఆగమేఘాలపై జరిగిపోయాయి. అయితే ఈ రిజర్వేషన్ పెంపుపై కొన్ని వర్గాల నుంచి అభ్యంతరాలు రావడంతో దాఖలైన పిటిషన్లపై విచారించిన హైకోర్టు ఇది రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించడం గమనార్హం. బీహార్ ఒక్కటే కాదు దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ ఏదో ఒక వర్గానికి పరిధి మించి రిజర్వేషన్ పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం, వాటిని కోర్టులు రద్దు చేయడం అనుభవమౌతూనే ఉన్నాయి. 'రిజర్వేషన్ల అవసరం పదేళ్లు మాత్రమే ఉంటుందని రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ గతంలో వెల్లడించారు. పదేళ్లలో సమాజం అభివృద్ధి చూడాలని, సామరస్యం నెలకొనాలని ఆయన కోరుకున్నారు. కానీ తరువాత ఏం జరుగుతోంది? కులాలు, వర్గాలు, మతాల పేరిట ప్రతి పదేళ్లకు రిజర్వేషన్లు డిగిస్తూనే పాలకవర్గాలు ముందుకుపోతున్నాయి.

దీని పర్యవసానాలు ఏమిటో ఆలోచించడం లేదు' అని 2018లో అప్పటి లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. ' రిజర్వేషన్లు మూడు రకాలు. రాజకీయ రిజర్వేషన్ (రిజర్వుడు నియోజక వర్గాలు), చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్, రాజ్యాంగంలోని ఆర్టికల్ 334 ప్రకారం రాజకీయ రిజర్వేషన్‌కు మాత్రమే పదేళ్ల పరిమితి ఉంది. చదువు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోసం రాజ్యాంగం ఎలాంటి కాలపరిమితి విధించలేదని ప్రొఫెసర్ హరినార్కే పేర్కొన్నారు. రాజకీయాల్లో కూడా రిజర్వేషన్లలో పదేళ్ల కాలపరిమితికి అంబేద్కర్ విముఖత చూపారని నార్కే వివరించారు. ఈ నేపథ్యంలో విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు 20% రిజర్వేషన్ చేయాలని 1954 లోనే సూచన మొదలైంది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితిని అంచనా వేయడానికి 1979లో మండల కమిషన్ అంటే సామాజికంగా, విద్యాపరంగా, వెనుకబడిన తరగతుల (ఎస్‌ఇబిసి) కమిషన్ ఏర్పాటైంది.

దీంతో గణనీయమైన మార్పు వచ్చింది. అనేక పరిణామాల తరువాత రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని 1992లో సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. ఈ పరిధి మించితే రాజ్యాంగం కల్పించిన సమాన ప్రాప్తి ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. అయితే రాజ్యాంగం సవరణతో 50% మించిపోయింది. ఈ పరిమితిని మించి చట్టాలు చేసిన రాష్ట్రాల వ్యాజ్యాలు సుప్రీం కోర్టు పరిశీలనలో ఉంటున్నాయి. ఉదాహరణకు తమిళనాడు రాష్ట్రంలో కులఆధారిత రిజర్వేషన్ 69 శాతంగా ఉంది. హర్యానాలో 2021లో స్థానిక అభ్యర్థులకు రూ. 25,000 కంటే తక్కువ ఆదాయం ఉన్న ప్రైవేట్ రంగ ఉద్యోగాల్లో 75% రిజర్వేషన్ తప్పనిసరి చేస్తూ హర్యానా ప్రభుత్వం చట్టాన్ని అమలు లోకి తేగా పంజాబ్ హర్యానా హైకోర్టు ఈ చట్టాన్ని 2023లో రద్దు చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. చత్తీస్‌గఢ్‌లో బిజెపి అధికారంలో ఉన్నప్పుడు 2012లో రిజర్వేషన్లు 50% నుంచి 58 శాతానికి పెంచారు.

ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేతలు కొందరు హైకోర్టుకు వెళ్లారు. ఆ తరువాత 2018 లో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక 2019 ఆగస్టు 15న కొత్త రిజర్వేషన్ల వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఎస్‌సిలు, ఒబిసిలు అన్ని రిజర్వేషన్లు కలుపుకుని మొత్తం 82 శాతానికి చేరింది. 2022లో చత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలు రిజర్వేషన్లపై తీవ్ర తరంగా ఆందోళనలు కొనసాగించగా, అప్పటి ప్రభుత్వం తలొగ్గి 82 శాతానికి రిజర్వేషన్లను పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను చత్తీస్‌గఢ్ హైకోర్టు కొట్టివేసింది.ఆ తరువాత పాత రిజర్వేషన్ వ్యవస్థను కూడా రాజ్యాంగ విరుద్ధమంటూ 2022 సెప్టెంబరులో తీర్పు వెలువరించింది.

# బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు అందుకోగలగాలి



**శామీర్ పేట, గరుడ వార్తా :** ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందగలగాలని శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు. సోమవారం రాత్రి బదిలీపై వెళ్తున్న పోలీసులకు ఆయన ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఎక్కడ విధులు నిర్వహించిన ఆ ప్రాంతంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని ఆకాంక్షించారు. విధులలో ప్రతి ఒక్కరికి గుర్తింపు వచ్చేలా సేవలందించాలని సూచించారు. విధులు నిర్వహించిన ప్రాంత ప్రజల్లో, తోటి ఉద్యోగుల గుండెల్లో ఎల్లవేళలా నిలిచిపోయే విధంగా సేవలందించాలని తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై చంద్రశేఖర్, ఏఎస్ఐ కమల్ గురి, హెడ్ కానిస్టేబుళ్లు జ్ఞానేశ్వర్ ప్రకాష్ మల్లికార్జున్ హిమవంతరావు శ్రీనివాస్ లు బదిలీపై వెళ్లారు. వారిని ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఎస్సైలు పోలీసులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం





**శామీర్ పేట, (గరుడ వార్త) :** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానము నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# ముందుకు సాగని మహాలక్ష్మీ




**వరంగల్, జూన్ :** కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో 'మహాలక్ష్మి' పథకం ఒకటి. ఈ పథకంలో భాగంగా తెలంగాణలోని ప్రతీ మహిళకు రూ. 2,500 ఆర్థిక సాయం చేయడం. గత ప్రభుత్వం వృద్ధులకు ఆసరా పింఛన్లు, బీడీ కార్మికులకు సాయం చేసింది. అలాగే చదువుకొని ఉద్యోగాలు చేయని వారికి నిరుద్యోగ భృతి అందిస్తామని పేర్కొంది. అయితే ఈ పథకం ప్రారంభం కాకపోవడంతో దీని స్థానంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ మహిళలకు రూ. 2,500 సాయం చేస్తానని తెలిపింది. దీంతో చాలా మంది మహిళలు ఇది అందరికీ వర్తిస్తుందని అనుకున్నారు. కానీ ఈ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం షాకింగ్ న్యూస్ తెలిపింది. అదేంటంటే?తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల పథకాలపై దృష్టి పెట్టింది. వీటిలో కొన్ని ఇప్పటికే అమలు చేసింది. ఇటీవల రుణ మాఫీ కోసం కసరత్తు పూర్తి చేస్తారు. ఆగస్టు 15 నాటికి రైతులకు రూ. 2 లక్షల వకు రుణమాఫీ చేయనున్నారు. దీని తరువాత కాంగ్రెస్ ప్రకటించిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు రూ. 2,500 సాయం గురించే ఆలోచిస్తారన్న చర్చ ప్రారంభమైంది. అయితే ఇటీవల జరిగిన సమావేశాలు, విధి విధానాలు చూస్తే ఈ పథకం ఇప్పట్లో ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపించడం లేదు.ప్రస్తుతం రైతు రుణ మాఫీపై తీవ్రంగా కృషి చేస్తున్నారు. దీని కోసం రూ. 40 వేల కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పథకం తరువాత కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. అయితే గతంలో లాగా రేషన్ కార్డులను అనర్హులకు కాకుండా అసవరమైన వారికే ఇవ్వాలని అనుకుంటున్నారు. ఇందులో భాగంగా ముందుగా సర్వే చేసిన తరువాత కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించనున్నారు. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ పూర్తియిన తరువాతే మహాలక్ష్మి (రూ. 2,500) స్కీంను ప్రారంభించే అవకాశం ఉంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. మహాలక్ష్మి పథకం గురించి ఓ న్యూస్ మహిళలకు షాక్ ఇచ్చినట్లయింది. రూ. 2,500 సాయం మొత్తాన్ని అందరికీ కాకుండా కొందరికీ మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆసరా పింఛన్లు, బీడీ కార్మికులకు కాకుండా కొత్త వారికి ఇవ్వాలని అనుకుంటోంది. అంతేకాకుండా ఉద్యోగాలు చేస్తున్న వారిని కూడా ఇందులో మినహాయించే అవకాశం ఉంది. అంటే ఈ ప్రక్షాళన తరువాత ఎలాంటి ఆదాయం వచ్చే పనులు చేయడంగా గృహిణులుగా ఉన్న వారికి మాత్రమే ఈ సాయం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి భేటీ



**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ తో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశమయ్యారు. తరువాత కోమటిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో సుస్థిర పాలన అందిస్తున్నాం. 8 పార్లమెంట్ సీట్లు గెలుచుకున్నాం. రాష్ట్రంలో ఆర్ఆర్ఆర్ నిర్మాణంపై విశేష కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం యుటిలిటీ చార్జీలు కట్టమని కేంద్రానికి లేఖ రాయడంతో ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు వెనక్కి వెళ్లిన విషయం మీ అందరికి తెలుసని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, నేను, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కలిసి యుటిలిటీ ఛార్జీలు కడతామని లేఖ ఇవ్వడం జరిగింది. దీంతోపాటు రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను నితిన్ గడ్కరీ కి వివరిస్తే వారే స్వయంగా యుటిలిటీ చార్జీలు చెల్లిస్తామని చెప్పారు. దీంతో ప్రాజెక్టు ముందుకు కదిలిన విషయం మీ అందరికి తెలిసిందే. ఎన్నికల మూలంగా ఆర్ఆర్ఆర్ మరియు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని 6 లేన్లుగా మార్చే పనులు కాస్త ఆలస్యం అయ్యాయి. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ప్రతీరోజు 60 వేల వాహనాలు ప్రయాణిస్తాయి. జీఎమ్మార్ అనే సంస్థ టోల్ రోడ్డు పనులు తీసుకొని 2024 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నప్పటికి ఇప్పటికి.. వారు వివిధ కారణాలు చూపించి పనులు పూర్తిచేయలేదు. దీనివల్ల ప్రతీరోజు అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు, వికలాంగులుగా మారుతున్నారు. నేను ఎంపీగా ఉన్నప్పుడు రోడ్డుయొక్క పరిస్థితిని వివరిస్తే ప్రమాదాల నివారణకు 17 బ్లాక్ స్పాట్లు గుర్తించి.. వాటి మరమ్మత్తుల కోసం కేంద్రమంత్రి రూ. 375 కోట్ల రూపాయలను మంజూరీ చేసినప్పటికి.. పనులు చేయాల్సిన జీఎమ్మార్ సంస్థ రెండుసార్లు కోర్టుకు పోయి పనులు చేయకపోతే.. మూడోసారి టెండర్ పిలిచి నిన్ననే పనులు ప్రారంభించిన సంగతి మీ అందరికి తెలిసిందే. డిసెంబర్ లోపు టెంపరరీ రిలీఫ్ కోసం పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఒక్క బ్లాక్ స్పాట్స్ రిపేర్లు మాత్రమే కాకుండా 6 లేన్ల రోడ్డును నిర్మించాలని అధికారులతో కలిసి నేను స్వయంగా గడ్కరీగారికి వివరించడం జరిగింది. రీజినల్ రింగ్ రోడ్డు కోసం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమీక్షిస్తానని గడ్కరీగారు చెప్పడం జరిగింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెండింగ్ లో ఉన్న 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు మరోసారి విన్నవించడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించారు. వాటికి జాతీయ రహదారుల సంఖ్యను కేటాయించాలని విన్నవించడం జరిగింది. వారు భారతమాల క్రింద మంజూరీ చేస్తామని చెప్పారని అన్నారు.

# తడిబట్టలతో ప్రమాణం చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**హుజురాబాద్:** తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని హుజరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రమాణం చేశారు. ఈరోజు చెల్పూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రమాణం చేయాలని సవాళ్ల విసురుకోగా.... లాండ్ అండ్ ఆర్డర్ సమస్య కారణంగా పోలీసులు కౌశిక్ రెడ్డిని గృహ నిర్బంధం చేశారు. దీంతో తన ఇంట్లోనే తడిబట్టలతో ఆంజనేయ స్వామి ఫొటోపై ప్రమాణం చేశారు. నేను ఎలాంటి అవినితీ చేయలేదని ప్రమాణం చేస్తున్నా..పొన్నం ప్రభాకర్‌కి ఫ్లై యాష్ తో సంబంధం లేదని ప్రమా ణం చేయాలి.. దాంతో పాటు.. లోడ్ లారీలను ఎందుకు ఆపడం లేదో.ఆ లోడ్ లారీల నుంచి.వాటా రావడం లేదని..పొన్నం ప్రభాకర్ ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. అలా ప్రమాణం చేస్తే... నేనూ బహిరంగ క్షమాపణ చెబుతా అంటూ మీడియా సాక్షిగా వెల్లడించారు.

# స్పీకర్‌కు జగన్ లేఖ

**విజయవాడ:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి లేఖ రాశారు. శాసనసభలో మంత్రుల తర్వాత ఎమ్మెల్యేగా తనతో ప్రమాణం చేయించడం పద్ధతులకు విరుద్ధమని అన్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్లుగా ఉందని.. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని.. పార్లమెంటులో కానీ ఉమ్మడి ఏపీలో కానీ ఈ నిబంధన పాటించలేదన్నారు. ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా ఉండాల్సిందేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన పలు అంశాలను ఆయన లేఖలో ప్రస్తావించారు. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని వైఎస్ జగన్ లేఖలో చెప్పారు. 'అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే నాపై శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. చచ్చేవరకూ కొట్టాలంటూ స్పీకర్ మాట్లాడిన మాటలు వీడియోల ద్వారా బయటపడ్డాయి. ఇలాంటి పరిణామాల మధ్య అసెంబ్లీలో గొంతు విప్పే పరిస్థితులు కనిపించడం లేదు. సభలో ప్రతిపక్ష హోదాతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే ఛాన్స్ ఉంటుంది. ప్రతిపక్ష పార్టీ హోదాతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుంది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని మాకు ప్రతిపక్ష హోదా ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి' అని లేఖలో జగన్ కోరారు.ప్రజా సమస్యలు చట్ట సభల్లో వినిపించాలంటే ప్రతిపక్ష హోదా ఉండాల్సిందే అని అన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశంలో జరిగిన పలు అంశాలను ఆయన లేఖలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, స్పీకర్ తనపై శత్రుత్వం ప్రదర్శిస్తున్నారని వాపోయారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోలు ఇటీవల బయట పడ్డామని తెలిపారు. ఇలాంటి నేపథ్యంలో అసెంబ్లీలో గొంతు విప్పే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. ప్రతిపక్ష హోదాతోనే సమస్యలను వినిపించే అవకాశం ఉందన్నారు. ఈ అంశాలను స్పీకర్ దృష్టిలో పెట్టుకోవాలని జగన్ సూచించారు. అంతే కాకుండా తమకు ప్రతిపక్ష హోదా ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు.తమ పార్టీ కార్యాలయాలే లక్ష్యంగా టీడీపీ విధ్వంసం సృష్టిస్తోందని వైసీపీ ఆరోపించింది. విజయవాడ, విజయనగరం పార్టీ కార్యాలయాల్ని కక్షపూరితంగా ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించింది. చంద్రబాబు ఇచ్చిన జీవోలతో టీడీపీ కట్టిన పార్టీ కార్యాలయాలను వదిలేసి.. అధికారులతో వైసీపీకి బలవంతంగా కూటమి ప్రభుత్వం నోటీసులు ఇప్పిస్తున్నందని పేర్కొంది. ఇదిలా ఉంటే కూటమి మాత్రం శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో జగన్‌కు తగిన గౌరవం ఇచ్చామని వెల్లడించింది. అసెంబ్లీ 175 స్థానాల్లో వైసీపీ 11 అసెంబ్లీ సీట్లు మాత్రమే గెలుచుకున్న విషయం తెలిసిందే.. దీంతో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కలేదు. అయితే మిగిలిన ఎమ్మెల్యేల మాదిరిగా ఆయన కూడా సాధారణ సభ్యుడే అనే వాదన ఉంది. కానీ జగన్‌కు సభలో ప్రాధాన్యం ఇవ్వాలని శాసన సభావ్యవహారాల మంత్రి పయ్యావుల కేషవ్ కూడా రిక్వస్ట్ చేశారు.ఆ విషయాన్ని పయ్యావుల, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మాజీ సీఎం పట్ల ఉదారంగా వ్యవహరించాలని కోరారు. సాధారణంగా ఎమ్మెల్యేలు తమ వాహనాలను అసెంబ్లీ బయటే ఉంచాలి. అక్కడే కారు దిగి లోపలికి రావాలి. కానీ జగన్ తన వాహనంలోనే సభా ప్రాంగణంలోకి రావడానికి అనుమతించాలని చంద్రబాబు సూచించారు. ఈ మేరకు అసెంబ్లీ ప్రారంభమైన తొలి రోజు అసెంబ్లీ భవనంలోని ప్రధాన ద్వారం వరకూ ఆయన వాహనాన్ని అనుమతించారు. అంతే కాకుండా ఎమ్మెల్యేగా ప్రమాణం చేసే సమయంలో ఆయన మిగిలిన సభ్యులతో పాటు అక్షర క్రమంలో తన పేరు వచ్చినప్పుడు ప్రమాణం చేయాల్సి ఉంటుంది. కాని సీఎం తన ప్రమాణ స్వీకారం తర్వాత జగన్ ప్రమాణ స్వీకారం చేయించాలని సూచించారట. జగన్ ఆలస్యంగా రావడంతోనే ఆయన ప్రమాణ స్వీకారం మంత్రుల ప్రమాణ స్వీకారం తర్వాత చేశారని చెబుతున్నారు.

## ఏపీలోని 2 లా కాలేజీలపై వేటు

**న్యూఢిల్లీ:** నిబంధనలకు విరద్ధంగా వ్యవహరిస్తున్న న్యాయ కళాశాలలపై బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా (ఃఅఎ) కొరడా ఝుళిపించింది. దేశవ్యాప్తంగా మొత్తం 7 కళాశాలల్లో ఈ ఏడాది (2024–25) ప్రవేశాలను రద్దుచేసింది. ఈ మేరకు అధికారక ప్రకటన విడుదల చేసింది. బీసీఐ చర్యలు తీసుకున్న కళాశాలల్లో ఏపీకి చెందిన లా కాలేజీలు రెండు ఉన్నాయి. వీటిలో ఒకటి తిరుపతి జిల్లా యేర్పాడు మండలం, అంజిమేడులోని శ్రీ ఈశ్వర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ లా కాగా.. రెండోది విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలోని గవరపాలెంలో ఉన్న శ్రీ షిరిడిసాయి విద్యాపరిషత్ ఆధ్వర్యంలోని శ్రీ షిరిడిసాయి లా కాలేజీ ఉన్నాయి.

**7లో నాలుగు యూపీ కాలేజీలే...**

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిషేధించిన 7 కళాశాలల్లో నాలుగు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందినవి కావడం విశేషం. ఇక మిగతా మూడు కాలేజీల్లో ఏపీలో రెండు, రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌కి చెందిన మాస్టర్ సోమ్‌నాథ్ లా కాలేజీ ఉంది.

**బీసీఏ నిషేధించిన యూపీలోని కాలేజీలు..**

1) హెచ్‌ఎస్ లా కాలేజీ (ఎతహ్, ఆగ్రారోడ్డు).
2) శ్రీ క్రిష్ణ కాలేజ్ ఆఫ్ లా (బాగ్‌పత్, మీరట్ రోడ్డు).
3) ఎస్‌ఎస్ కాలేజ్ ఆఫ్ లా (అలీఘడ్ జిల్లా, మన్సూర్ కలాన్ ఖైర్).
4) తేజుసింగ్ మెమోరియల్ లా కాలేజ్ (శబల్‌పూర్, జేపీనగర్).

ఏపీలోని లా కాలేజీల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించి జూన్ 9న ఏపీ లాసెట్/ పీజీఎల్‌సెట్ 2024 ప్రవేశ పరీక్షను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన సంగతి తెలిసిందే. జూన్ 9న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏపీ లాసెట్ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షకు సంబంధించిన ప్రాథమిక ఆన్సర్ కీని జూన్ 10న విడుదల చేసింది. అభ్యర్థుల నుంచి జూన్ 11 నుంచి జూన్ 12 వరకు ఆన్సర్ కీపై అభ్యంతరాలు స్వీకరించింది. ఈ ప్రక్రియ పూర్తవడంతో ఫలితాల వెల్లడికి ఉన్నతవిద్యామండలి ఏర్పాట్లు చేస్తోంది. ఏపీలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 35 న్యాయకళాశాల్లో యూజీ, పీజీ కోర్సుల్లో సీట్లను లాసెట్ ద్వారా భర్తీచేయనున్నారు. ఆయా కళాశాలల్లో మొత్తం 8238 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఐదేళ్ల లాడిగ్రీలో 2,660 సీట్లు మూడేళ్ల లా డిగ్రీలో 5,578 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక పీజీ లాడిగ్రీలో 325 సీట్లు మాత్రమే ఉన్నాయి.

=================

## చరిత్ర సృష్టించిన ఆఫ్గన్

**ముంబై:** నరాలు తెగే ఉత్కంఠ.. బంతి బంతికి మారిన ఆధిక్యాలు.. ఆటగాళ్ల భావోద్వేగాలు... వర్షం అంతరాయాలు.. ఆటగాళ్ల ఆస్కార్ నటనలు... అమ్మో... అన్నా ఇన్నా అఫ్గాన్– బంగ్లాదేశ్ మధ్య జరిగిన సూపర్ ఎయిట్) పోరు... మామూలుగా సాగలేదు. సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో.. విజయం కోసం అఫ్గాన్) అద్భుతంగా పోరాడింది. తమకు నామమాత్రపు మ్యాచ్ అయినా బంగ్లా(ఃజీని) తేలిగ్గా పరాజాయాన్ని అంగీకరించలేదు. దీంతో ఈ రెండు జట్ల మధ్య ఈ టీ 20 ప్రపంచకప్‌లోనే హైలెట్ మ్యాచ్‌గా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసి స్వల్ప స్కోరే చేసిన అఫ్గాన్.. ఆ తర్వాత అద్భుత బౌలింగ్‌తో బంగ్లాదేశ్‌ను తక్కువ పరుగులకే పరిమితమైంది. అఫ్గాన్ విజయానికి అడ్డుగోడగా నిలిచిన లిట్టన్ దాస్ ఓపెనర్‌గా బరిలోకి చివరి వరకూ అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో చిరస్మరణీయ విజయం సాధించిన అఫ్గాన్ సెమీస్‌లోకి దూసుకెళ్లి చరిత్ర సృష్టించగా... అద్భుతంగా పోరాడిన బంగ్లాదేశ్ సంతృప్తిగా టీ 20 ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది.

**తక్కువ పరుగులే..**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్గానిస్థాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అసలే బౌలింగ్ అనుకూలిస్తున్న పిచ్‌పై బంగ్లా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. పలుమార్లు ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. అఫ్గాన్ ఓపెనర్లు రహ్మతుల్లా గుర్బాజ్–ఇబ్రహీం జద్రాన్ అఫ్గాన్‌కు శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 59 పరుగులు జోడించారు. పిచ్ బౌలింగ్‌కు అనుకూలిస్తుండడంతో రన్‌రేట్‌ను ఆరు పరుగులకు తక్కువ కాకుండా అఫ్గాన్ ఓపెనర్లు ఓ ప్రణాళిక ప్రకారం ఆడారు. పది ఓవర్లకు 59 పరుగులు జోడించిన అనంతరం అఫ్గాన్ తొలి వికెట్ కోల్పోయింది. 29 బంతుల్లో 18 పరుగులు చేసిన జద్రాన్ అవుటయ్యాడు. ఆ తర్వాత కాసేపటికే గుర్బాజ్ కూడా పెవిలియన్ చేరాడు. 55 బంతుల్లో 43 పరుగులు చేసి గుర్బాజ్ అవుటయ్యాడు. ఆ తర్వాత బంగ్లా బౌలర్లు పట్టు బిగించారు. తర్వాత వచ్చే అఫ్గాన్ బ్యాటర్లను పరుగులు చేయకుండా అడ్డుకున్నారు. దీంతో పరుగుల రాక బాగా తగ్గిపోయింది. ఒమ్రాజాయ్ 10, గుల్బదీన్ నైబ్ 4, నబీ 1 పరుగుకే పెవిలియన్ చేరారు . కెప్టెన్ రషీద్ ఖాన్ కేవలం 10 బంతులు ఆడి 3 సిక్సర్లతో 19 పరుగులు చేయడంతో అఫ్గాన్ నిర్ణీత 20 ఓవర్లలో అయిదు వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. 116 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్... చివరి ఓవర్ వరకూ పోరాడింది. రెండో ఓవర్‌లోనే తొలి వికెట్ కోల్పోయిన బంగ్లాదేశ్... లక్ష్య ఛేదనలో తడబడుతున్నట్లే కనిపించింది. కానీ లిట్టన్ దాస్ ఒంటరి పోరాటం చేశాడు. మిగిలిన బ్యాటర్లందరూ అవుట్ అవుతున్నా లిట్టన్ మాత్రం అఫ్గాన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించాడు. అఫ్గాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా లిట్టన్ దాస్ మాత్రం పోరాడాడు. లిట్టన్ పోరాటంతో ఓ దశలో బంగ్లాదేశ్ గెలిచేలా కనిపించింది. కానీ అఫ్గాన్ పోరాటాన్ని ఆపలేదు. వరుసగా వికెట్లు తీస్తూ బంగ్లాదేశ్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని చూసింది. కానీ లిట్టన్ దాస్ మాములుగా ఆడలేదు. 49 బంతుల్లో అయిదు ఫోర్లతో ఒక సిక్స్‌తో 54 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఓవైపు బంగ్లాదేశ్ ఆలౌట్ అయినా లిట్టన్‌దాస్ మాత్రం నాటౌట్‌గా నిలిచాడు. చివరి ఎనిమిది బంతుల్లో ఆరు పరుగులు కావాల్సిన దశలో నవీనుల్ హక్ వరుసగా రెండు బంతుల్లో రెండు వికెట్లు తీసి అఫ్గాన్‌కు చరిత్రలో నిలిచిపోయే విజయాన్ని అందించాడు.

=================

## పార్టీ ఫిరాయింపులు అడ్డుకునేందుకు బీఆర్ఎస్ రెండంచల వ్యూహం

**హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపులు అడ్డుకునేందుకు బీఆర్ఎస్ రెండంచెల వ్యూహం.! ఒక్కరితో మొదలైన ఫిరాయింపులు ఐదుకు చేరాయి. ఈ విషయంలో కాంగ్రెస్ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది బీఆర్ఎస్. పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీ గతంలో చేసిన వ్యాఖ్యలు, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. మరోవైపు ఎమ్మెల్యేలు పార్టీ మారిన నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌ఛార్జ్‌ను నియమించడంతో పాటు క్యాడర్ చేజారకుండా కసరత్తు చేస్తోంది. పార్టీలో కమిటీలు వేయాలని నిర్ణయించింది. మరోవైపు న్యాయపోరాటానికి సైతం సిద్ధమవుతోంది.

# రాహుల్ ముందుచూపు



ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాన్ని తనకే అట్టిపెట్టుకుని కేరళలోని వయనాడ్ నియోజక వర్గాన్ని తన సోదరి ప్రియాంక గాంధీకి అప్పగించడం వెనుక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందుచూపు స్పష్టమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లో తిరిగి కాంగ్రెస్ వైభవాన్ని పెంపొందించుకోడానికి, 2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఎక్కువ సీట్లు సాధించుకోడానికి రాయ్‌బరేలీ స్థానమే పోరాట కేంద్రంగా కాంగ్రెస్ మలచుకుంటోంది. ఇప్పుడు కాంగ్రెస్‌కు సురక్షితమైన స్థానంగా పరిగణిస్తున్న వయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ విజయం సాధిస్తే నెహ్రూ గాంధీ కుటుంబం నుంచి మొదటిసారి పార్లమెంట్‌కు ముగ్గురు ఒకేసారి ప్రాతినిధ్యం వహించే అవకాశం కలుగుతుంది.

దీంతోపాటు ఒకే కుటుంబం నుంచి వారసత్వ రాజకీయాలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందన్న ఆరోపణలు కూడా వస్తాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్‌లో ఆరు స్థానాల్లో విజయం సాధించి మళ్లీ కోలుకోగలిగింది. గత ఐదేళ్లుగా దాదాపు ఉనికిని కోల్పోయిన కాంగ్రెస్‌కు ఈసారి ఎన్నికల ఫలితాలు ఊపిరి పోశాయి. ఉత్తరప్రదేశ్ కాషాయనాథుల కంచుకోట అన్న ప్రతిష్టకు బీటలు పడ్డాయి. కాషాయనాథుల్లో అత్యంత ప్రముఖునిగా, ప్రధాని మోడీ అమిత్ షా ద్వయానికి అత్యంత సన్నిహితునిగా పేరు పొందిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సామర్థ్యానికి సవాలుగా ఉత్తరప్రదేశ్‌లోని ఎన్నికల ఫలితాలు ఊహించని అనుభవాన్ని మిగిల్చాయి. ఇక కాంగ్రెస్ కూడా ఫలితాలు తమకు ఇంత అనుకూలంగా వస్తాయని ఊహించలేదు. 2014లో కాంగ్రెస్ రాయ్‌బరేలీ, అమేథీ స్థానాలను సాధించి, ఓట్ల వాటా 7.53% వరకు దక్కించుకోగలిగినప్పటికీ, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం రాయ్‌బరేలీ మినహా అమేథీతో సహా అన్ని స్థానాలను కాంగ్రెస్ కోల్పోయింది. ఆనాడు బిజెపి అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓడిపోయారంటే కాంగ్రెస్ ఉనికి అప్పుడు ఏ విధంగా కోల్పోయిందో చెప్పవచ్చు. ఏదేమైనా ఈసారి కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేసి, మిగతా స్థానాలను 'ఇండియా' కూటమి భాగస్వాములకు విడిచిపెట్టింది. పరిమిత స్థానాల్లోనే పోటీ చేసినప్పటికీ ఆరు స్థానాల్లో గెలవగలిగింది. ఓట్ల వాటా 9.46 శాతానికి పెంచుకోగలిగింది. ఉత్తరప్రదేశ్ నుంచి సానుకూల ఫలితాలు రావడంతో పార్లమెంట్ దిగువ సభలో అత్యంత గరిష్ఠ స్థాయిలో ప్రాతినిధ్యం పొందగలిగింది. దీంతో రాయ్‌బరేలీ స్థానాన్ని, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని రాహుల్ గాంధీ విడిచిపెట్టడం లేదన్న సంకేతాలు కాంగ్రెస్ పంపడానికి వీలవుతోంది.

మరో ముఖ్యమైన అంశం ఏమంటే కాంగ్రెస్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీకి ఉత్తరప్రదేశ్‌లో సానుకూల ఫలితాలు వెలువడడంతో ఆ రాష్ట్ర ఓటర్ల మనోభావం బిజెపికి వ్యతిరేకంగా ఉన్నట్టు బయటపడింది. 2019లో ఉత్తరప్రదేశ్‌లో బిజెపి 62 సీట్లలో విజయపతాకం ఎగురవేయగా, ఇప్పుడు కేవలం 33 సీట్లనే దక్కించుకోగలిగింది. దీన్ని బట్టి ఉత్తరప్రదేశ్‌లో కమలనాథులకు ప్రజాదరణ సగానికి సగం తగ్గినట్టు కనిపిస్తోంది. ఈ పరిణామాలను పరిశీలించి రాహుల్ దూరదృష్టితో కాంగ్రెస్ ఉనికిని మరింత పటిష్టపర్చుకోడానికి గట్టిగా పని చేయాలన్న లక్షంతో రాయ్‌బరేలీ స్థానాన్ని విడిచిపెట్టలేదు. దీని ద్వారా ఉత్తరప్రదేశ్‌లోను, హిందీ రాష్ట్రాల్లోనూ తమ పోరాటాన్ని బిజెపిపై కొనసాగిస్తామని, మరిన్ని ఫలితాలను సాధిస్తామని కాంగ్రెస్ స్పష్టమైన సందేశాన్ని అందించగలిగింది. ఈ మేరకు 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను సాధించడానికి ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేస్తోంది. 2022లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 403 స్థానాల్లోనూ కాంగ్రెస్ పోటీ చేసినా కేవలం రెండే రెండు స్థానాలను దక్కించుకోగలిగింది. ఓట్ల వాటా కూడా 2.33 శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో మిత్రపక్షం సమాజ్‌వాది పార్టీతో కలిసి రాహుల్ రాయ్‌బరేలీలో తమ పట్టు గట్టిగా నిలదొక్కుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. అందుకే రాయ్‌బరేలీ రానున్న అసెంబ్లీ ఎన్నికలకు రాహుల్ వ్యూహాత్మక కార్యస్థాన కేంద్రంగా రూపుదిద్దుకోనున్నది. కేరళలోని వయనాడ్ స్థానం గురించి రాహుల్ పదేపదే భావోద్వేగ సంబంధంగా అభివర్ణించడం ఈ సందర్భంగా ప్రస్తావించడం అవసరం. 2019లో కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్‌లో దాదాపు తుడిచిపెట్టుకుపోయినప్పుడు వయనాడ్ స్థానమే రాహుల్‌ను ఆదుకోగలిగింది. తమ కుటుంబానికి కంచుకోటగా ఉంటున్న అమేథీ కూడా రాహుల్‌కు దూరమైనప్పుడు కేరళలోని కాంగ్రెస్ నాయకుల నేతృత్వంలోని యుడిఎఫ్ ఆసరా కల్పించింది. అందుకనే కాంగ్రెస్‌కు సురక్షితమైన స్థానంగా విశ్వసిస్తోన్న వయనాడ్ నుంచి ఉప ఎన్నికకు పోటీ చేయడానికి రాహుల్ ప్రోద్బలంతో ప్రియాంక గాంధీ సిద్ధమయ్యారు.

# మళ్ళీ మొదలైన బిజెపి దాడి...

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల తీర్పు ప్రత్యేకంగా చెప్పుకోదగింది. తాము ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ఎంత విలువ ఇస్తామో ఈ తీర్పు ద్వారా ప్రజలు చాటి చెప్పారు. 2014లోనూ, 2019లోనూ పరిపూర్ణ ఆధిక్యత తెచ్చుకున్న బిజెపికి ఈసారి ప్రజలు ఆ అవకాశం నిరాకరించారు. 303 స్థానాలున్న బిజెపి సీట్ల సంఖ్య ఈసారి 240కి పడిపోయింది. అంటే 21% తగ్గింది. ఎన్‌డిఎకు 292, 'ఇండియా' వేదికకు 234 స్థానాలు వచ్చాయి. మోడీ పదేళ్ల పాలన నేపథ్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ పాలన మొత్తం లక్షణం నియంతృత్వ పోకడలతో హిందూత్వ, మతతత్వ ఎజెండాను అమలు జరిగింది. రాజ్యాంగ వ్యవస్థలో ప్రతి అంగమూ దిగ్బంధానికి గురైంది. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట పెట్టుకోవడానికి దారితీసింది. ఎన్నికల సన్నాహక దశలోనే ఇది ప్రతిబింబించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా పెట్టుకుని దాడి చేశాయి. ఇద్దరు ముఖ్యమంత్రులు జైళ్ల పాలయ్యారు. కాంగ్రెస్, సిపిఐ(ఎం)వంటి రాజకీయ పక్షాలపై కక్ష సాధింపు సాగింది. ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షానికి సమాన అవకాశం లేకుండా పోయింది. ఈ విషయంలోఎన్నికల కమిషన్ శోచనీయమైన పాత్ర పోషించింది. వెన్నెముకలేని కమిషనర్లతో నియమించబడిన ఎన్నికల కమిషన్ ఎన్నికల నియమావళి ఘోర ఉల్లంఘనలను శిక్షించడంలో గట్టిగా నిలబడలేక విఫలమైంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాలలో ముస్లింలపై విషం కక్కుతున్నా హద్దు అదుపూ లేకపోయింది.

పోలింగ్ శాతానికి సంబంధించిన లెక్కలను క్రోడీకరించడంలో పారదర్శకత చూపించలేక అనవసర సందేహాలకూ తావిచ్చింది. ఈ కీలక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతకు విఘాతమేర్పడింది.

కార్పొరేట్ మీడియావరణాన్ని పూర్తిగా బిజెపి గుత్తాధిపత్యంలోకి తెచ్చుకుంది. సోషల్ మీడియాలోనూ భారీ వనరులు గుమ్మరించింది. ప్రచారంలోనూ ఓటర్లకు పంచిపెట్టడం కోసమూ వేల కోట్లు వెచ్చించింది. ఈ మొత్తం ప్రచారంలో మోడీ, ఆయన హంగుదార్లు 'ఇండియా' వేదికలోని పార్టీల పట్ల బెదిరింపులు, మోసగింపు ఎత్తుగడలకు పాల్పడ్డారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలోనే 'ఇండియా' వేదిక పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహించవలసి వచ్చింది. మోడీ పచ్చిమతోన్మాద పల్లవికి వ్యతిరేకంగా ప్రతిపక్షం నిరుద్యోగం, ఉద్యోగాలు, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం వంటి అంశాలను ముందుకు తెచ్చింది. హిందూత్వ శక్తుల నుంచి ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ఎదురవుతున్న ప్రమాదాలపై దృష్టి సారించేలా చేసింది. మొట్టమొదటిసారిగా రాజ్యాంగ రక్షణ అంశం విశాల ప్రజారాశులను మరీ ముఖ్యంగా దళితులను ఆకట్టుకుంది. బిజెపి మెజారిటీ కోల్పోవడంలో ఉత్తరప్రదేశ్‌లో దానికి తగిలిన ఎదురు దెబ్బ కీలకమైంది. అక్కడున్న 80 స్థానాలలోనూ గతంలో 62 వస్తే ప్రస్తుతం 33 మాత్రమే పొందగలిగింది. హిందూత్వ రాజకీయాలకు ఉత్తరప్రదేశ్ గుండెకాయ లాంటిది. అయోధ్యలో రామ మందిరం, హిందూ దురభిమాన ఎజెండాకు ప్రతీక లాంటిది. ఇవన్నీ ఉన్నా బిజెపి ఓట్లు 9% తగ్గిపోయాయి. నిరుద్యోగ సమస్య మూకుమ్మడి ప్రభావం, ధరల పెరుగుదల, రైతుల అసంతృప్తి, అగ్నివీర్ పథకంపై యువత అసంతృప్తి, పరీక్షా పత్రాల లీకేజీ వంటి అంశాలే మతతత్వ సమీకరణను మించిన ప్రభావం చూపించాయి.

సమాజ్ వాది పార్టీ చాకచక్యంగా నడిపిన కుల సమీకరణ రాజకీయాలు ఇందుకు తోడైనాయి. అయోధ్యకు నెలవుగా వున్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించే బిజెపి సభ్యుడు ఓడిపోవడం ఓటరు ఎంత దూరమైనారో కళ్లకుకట్టే కఠోర వాస్తవంగా నిలిచింది. ఎగ్జిట్ ప్రహసనం ఏడవ చివరి దశ పోలింగ్ ముగిశాక వెల్లువగా




వచ్చిన ఎగ్జిట్ పోల్స్ ఎన్‌డిఎ గొప్ప విజయం సాధించబోతున్నదన్న చిత్రణ ఇచ్చాయి. సగటున చూస్తే బిజెపికి కనీసంగా 367 వస్తాయని చెప్పాయి. ప్రతిపక్షాలను డీలా పడేసి పాలక పార్టీ ఆధిపత్యానికి కొమ్ముకాయడానికి ప్రయోగించిన ఆయధాలే ఇవి. మరింత లోతైన ఉద్దేశం మీడియా కార్పొరేట్ కూటమితో స్టాక్ మార్కెట్లో లాభాలు కొల్లగొట్టడం. దీనంతటి వల్ల ముంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మదుపరుల పెట్టుబడి రూ. 14 లక్షల కోట్లు పెరిగింది. ఎపి, ఒడిశా పాతాలు పార్లమెంటుతో పాటు శాసనసభ ఎన్నికలు జరిగిన ఒడిశాలో బిజూ జనతాదళ్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సిపి ఈ ఎన్నికల్లో అధికారం కోల్పోయాయి.

అవి లోక్‌సభ ఎన్నికలలో దెబ్బతినడమేగాక రాష్ట్ర ప్రభుత్వాలను పోగొట్టుకున్నాయి. ఒడిశాలోని 21 లోక్‌సభ స్థానాలలో బిజెపి 20 స్థానాలు తెచ్చుకోవడమే గాక శాసనసభలోనూ మెజార్టీ తెచ్చుకుంది. మోడీ ప్రభుత్వంతో జతకట్టే లేదా వత్తాసునిచ్చే ప్రాంతీయ పార్టీలకు ఈ రెండు రాష్ట్రా లూ ఒక గుణపాఠం నేర్పుతున్నాయి. బిజెపిని గట్టిగా వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలు డిఎంకె, సమాజ్ వాదీ పార్టీ, ఆర్‌జెడి వంటివే నిలదొక్కుకుని మరింత బలోపేతమైనాయి. బిజెపి ఇంత గట్టి దెబ్బ తిందంటే దానికి పూర్తి కారకుడు మోడీనే. దీని వెనక అసలు కుట్రదారి బిజెపినే. ఆ పార్టీ ఎన్నికల ప్రణాళిక కూడా మోడీకే గ్యారంటీ అని నామకరణమైంది. మోడీ చుట్టూ సృష్టించబడిన అత్వం కథలు కకావికలైపోయాయి. ఎన్‌డిఎ మిశ్రమ ప్రభుత్వ ఏర్పాటుతోనైనా మోడీ, అమిత్ షాల బరితెగింపు పోకడలకు కళ్లెంపడుతుందని ఆశించాలి. ఎన్‌డిఎకు మూడింట రెండు వంతుల బలమేమీ వుండబోదు. ఒకే దేశం, ఒకే ఎన్నిక వంటి అనేక పథకాలను తీసుకొచ్చే ఆలోచనలు దీంతో ఛిన్నాభిన్నమైనట్టే. మూడో దఫా అధికారంలోకి రాగానే ఏకకాలంలో ఎన్నికల వ్యవస్థ తీసుకొస్తామని అమిత్ షా వాగ్దానం చేశారు. దాని కోసం అవసరమైన అనేక రాజ్యాంగ సవరణలు తీసుకొస్తామన్న ఆయన మాట ఇక అమలు జరిగేది కాదు.

'ఇండియా' అనుభవాలు ఏమైనా నిరంతరం అప్రమత్తంగా వుండటం ఇప్పటికీ అవసరమే. ఎందుకంటే నిరంకుశ హిందూత్వ లక్షణాలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి జన్యుధాతువుల్లోనే వున్నాయి. తమ ఎజెండాను ముందుకు నెట్టడానికి ప్రత్యక్షంగా కాకపోతే రహస్యంగా మార్గాలు నిరంతరం వారు అన్వేషిస్తానే వుంటారు. ఈ కారణంగానే పార్లమెంటులో, అంతకంటే ముఖ్యంగా సభ వెలుపలా సమైక్య ప్రతిపక్షం పాత్ర కీలకమవుతుంది. 'ఇండియా' వేదిక పార్టీలు ఒక ఉమ్మడి వేదిక ద్వారా సమన్వయాన్ని మెరుగుపర్చుకుని పని చేయాల్సి ఉంటుంది. 'ఇండియా' కలయిక పార్టీల కొద్ది మాసాల అనుభవాన్ని గమనిస్తే ఒక ఖచ్చితమైన కూటమిగా గాక విశాల వేదికగా వ్యవహరించడం ఉపయుక్తమని తేలింది. రానున్న రోజుల్లో 'ఇండియా' కూటమికి కలసిరాగలిగిన ఒక పరిణామం, ఈ ఏడాది జరిగే నాలుగు అసెంబ్లీల ఎన్నికలు, ముఖ్యంగా మహారాష్ట్ర ఎన్నికలు. ఈ ఎన్నికలలో మంచి ఫలితాలను చూపించగలిగితే, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మీద ఒత్తిడి పెరుగుతుంది. బిజెపిలోనూ, ఎన్‌డిఎ కూటమిలోనూ అంతర్గతంగా భిన్నస్వరాలు వినిపిస్తాయి.

కానీ ఇప్పుడే తాము గెలిచామని తబ్బిబ్బైపోతున్న కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, అసెంబ్లీ ఎన్నికలను తేలికగా తీసుకుంటే, పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. 'ఇండియా' కూటమికి ఉన్న మరో సానుకూల అంశం ఏమిటంటే భాగస్వామ్యపక్షాల్లో ఏ ఒక్కటీ ఎన్‌డిఎ కూటమిలోకి మళ్లే అవకాశం బాగా తక్కువ. ఉద్ధవ్ ఠాక్రే అటువైపు చూడరా, అవసరమైతే స్టాలిన్ కూడా రాజీపడడా, శాంతి కోసం మమత చేయి కలపదా అని సాంకేతికంగా వాదిస్తే చెప్పలేము కానీ, కూటమిలోని ప్రతీ పార్టీ బిజెపి వల్ల ఏదో రకంగా బాధిత పక్షమే కాబట్టి, అట్లా జరగడం కష్టం. పైగా ఈ పక్షాలు అన్నీ తమ తమ రాష్ట్రాలలో బిజెపి నుంచి సవాళ్లను ఎదుర్కొంటున్నవే.

వైవిధ్యాలనూ, పరస్పరం పోలి వుండే రాజకీయ కార్యక్రమాలు, విధానాలను వేదిక ఇముడ్చుకునే వీలు కలిగింది. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్యతత్వానికి కట్టుబాట్లు సూత్రాలుగా పని చేయాలి. నిరంకుశ మతతత్వ ప్రమాదంపై పోరాటం ఎంత మాత్రం ముగియలేదు. హిందూత్వ కార్పొరేట్ శక్తుల కూటమిపై సమరం మరింత ఉధృతం కావడంఅనివార్యం. సంఘ్ పరివార్, హిందుత్వ శక్తులు చెలరేగిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఒడిశాలోని బాలాసోర్‌లో బిజెపి, సంఘ్ పరివార్ శక్తులు ఒక వ్యూహం ప్రకారం మతఘర్షణలను రెచ్చగొట్టాయి. ఉత్తరప్రదేశ్‌లో గో గూండాలు దాడులకు దిగుతున్నారు. అరుంధతీ రాయ్‌పై ఉపాను ప్రయోగించడం ప్రజల పక్షాన నిలబడి, గొంతు విప్పి, పోరాడే ప్రతి ఒక్కరికీ ఒక హెచ్చరిక వంటిది. ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా కదిలి ఈ దాడిని తిప్పికొట్టడంతో పాటు రానున్న రోజుల్లోనూ అప్రమత్తంగా ఉండాలి. ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరచాలి. రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటనా స్వేచ్ఛను కాపాడుకునేందుకు ప్రజలు, ప్రజాతంత్ర శక్తులు సదా జాగరూకులై వుండాలి.

# 58 ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...!

**– జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి :**ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ , జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఆర్డీఓ బి.గంగయ్య లతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరిఖని విటల్ నగర్ కు చెందిన మహమ్మద్ రెహాజుద్దిన్ తాను ఎంఏ ఇంగ్లీష్, పిజిడిసిఏ పూర్తి చేసానని, తనకు కలెక్టరేట్ లో లేదా ప్రభుత్వ రంగ కార్యాలయంలో ఏదైనా విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ గాని, రికార్డ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటికి రాస్తూ అవకాశం, అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం మంగపేట్ కు చెందిన దాముక వెంకటమ్మ తన భర్త మరణించినందున తనకు ప్రభుత్వం అందజేసే వితంతువుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, కాల్వ శ్రీరాంపూర్ ఎంపీడీవో కు రాస్తూ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఎం.సురేష్ తండ్రి పేరు రాజయ్య ఇప్పలపల్లి నివాసుడైన కొమురయ్య కు తనకు ఆర్థిక తగాదాలు ఉన్నాయని, కొమురయ్య సర్వే నెంబర్ 786/బి/3/2 లో గల భూమిపై తాను సుల్తానాబాద్ కోర్టులో దావా వేయడం జరిగిందని, ఇట్టి సర్వే నంబర్లలో ఎలాంటి మార్పులు, చేర్పులు, లావాదేవీలు జరగకుండా నిలువరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండంలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక కాబడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు తమకు ఇండ్లను కేటాయించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, వారి దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ వివరాలు తెప్పించుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని లబ్ధిదారుల బృందానికి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ., సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 53 చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం?



**నాగర్ కర్నూల్ :** చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం? వెలుగులోకి వచ్చింది. భూమి అమ్మడం లేదని 20 రోజుల క్రితం ఈశ్వరమ్మ మామ నాగన్నను హత్య చేసిన విషయం ఇవాళ వెలుగు చూసింది . చెంచుల భూముల పై కొంత మంది గ్రామస్థులు కన్నేశారు. ఈ నెల 3న ఈశ్వరమ్మ చిన్నమామ కాట్రాజు నాగన్న (56)కు చెందిన 2.5 ఎకరాల భూమిని బండి వెంకటేష్ ఎకరా రూ. 20 లక్షలు పలుకుతుండగా రూ. 4.5 లక్షల చొప్పున ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అందుకు నాగన్న ఒప్పుకోకపోవడంతో గ్రామ శివారులో అతడిని హత్య చేశారు. శవ పరీక్ష నిర్వహించకుండానే అంత్యక్రియలు చేశారు. భూతగాదా నేపథ్యంలో నాగన్నను హత్య చేసి ఉంటారనే ఆరోపణలు వస్తున్నాయి. చెంచుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి భూమిని దక్కించుకునేందుకు నాగన్న హత్య చేసేందుకు కూడా వెనకడలేదన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి. చెంచు మహిళ ఈశ్వరమ్మ భూమిని కౌలు తీసుకున్న వ్యక్తులు ఆమెపై పాశవికంగా దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే.నాగర్ కర్నూల్ ? కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో బాధితురాలు చెంచు మహిళ ఈశ్వరమ్మ, భర్త ఈదన్న తమ వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారు. ఆ భూమిలో వెంకటేశ్ ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం పెట్టుకోగా తన దగ్గరే ఈదన్న, బాధితురాలు ఈశ్వరమ్మ పని చేసేవారు. ఈశ్వరమ్మ పనికి రావడంలేదని ఆమె మర్మంగాలపై కారం చల్లి, డీజిల్ పోసి నిప్పంటించి పాశవికంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈశ్వరమ్మ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. నిమ్స్ లో ఈశ్వరమ్మను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులకు ఆదేశించారు

# 57 పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలి....




## –బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
## –మంథని బిఆర్ఎస్ నాయకుల డిమాండ్

**మంథని :** బీఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా విజయం సాధించి కాంగ్రెస్ పార్టీలో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని మంథని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఏగొలపు శంకర్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య డిమాండ్ చేశారు. సోమవారం మంథని పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుండి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారడం సిగ్గుచేటని వారు తీవ్రంగా మండిపడ్డారు. జాగృతి అధ్యక్షురాలు కవిత అండతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. అధికార పార్టీలో చేరాలనుకుంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చేరాలని అంతేతప్ప ఒక పార్టీ గుర్తు మీద గెలిచి మరొక పార్టీలో చేరడం సరికాదని వారు అసహనం వ్యక్తం చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తక్షణమే బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కు క్షమాపణ కోరాలని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని వారు తీవ్రంగా హెచ్చరించారు. పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించే అధికార పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్ కాయితి సమ్మయ్య, ఎంపీటీసీ చెరుకు తోట ఓదెలు, జనగామ సంతోష్, వేముల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు. సోమవారం మంథని పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుండి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారడం సిగ్గుచేటని వారు తీవ్రంగా మండిపడ్డారు. జాగృతి అధ్యక్షురాలు కవిత అండతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు.

# 61 ధోబీ ఘాట్ ప్రదేశాన్ని సందర్శించిన నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.....




**నంద్యాల :** నంద్యాల గోపాల్ నగర్ 15 వ వార్డు నందు రజక సోదరుల కోసం నిర్మించబోయే "ధోబీ ఘాట్" ప్రదేశాన్ని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభిర్భావం నుండి బీసీ సోదరులకు అండాదండగా నిలిచిందని బీసీ సమాజన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి టీడీపీ పార్టీ కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే ఎన్నికల ప్రచారంలో రజక సోదరులకు దోబీ ఘాట్ నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని దాన్ని నెరవేర్చే దిశగా ఈరోజు ధోబి గాట్ ప్రదేశాన్ని సందర్శించడం జరిగిందన్నారు . అనంతరం అక్కడికి వచ్చిన రజక సోదరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని ఏ సమస్య వచ్చినా మీ ముందు నేను ఉంటానని సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది . గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో బీసీలకు గాని ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు గాని వారు చేసింది ఏమీ లేదని మాటలకే పరిమితమయ్యారన్నారు . నంద్యాల నా బాధ్యత అనే వ్యక్తి ప్రజల్ని విస్మరించి ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో విఫలం అయ్యాడు అన్నారు . కానీ తెలుగుదేశం పార్టీ అలా కాదని తెలుగుదేశం పార్టీ అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని పోయి వారి అవసరాలను తీరుస్తూ వారి వెంట ఉండే పార్టీ అన్నారు . తెలుగుదేశం పార్టీ మీకు ఎప్పటికీ అండగా ఉంటుందని మీరేం భయపడాల్సిన అవసరం లేదని ఖచ్చితంగా మేము ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏ.వి.ఆర్ ప్రసాద్ మరియు టిడిపి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీపై వాగ్యుద్ధం.....



**న్యూఢిల్లీ :** లోక్‌సభ సమావేశాలు వాడీవేడిగా మొదలయ్యాయి. ఎమర్జెన్సీపై అధికార విపక్షాల నడుమ వాగ్యుద్ధం నడిచింది. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఓ మచ్చ అని ప్రధాని మోదీ విమర్శించగా.. గత పదేండ్లలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని ప్రతిపక్ష కాంగ్రెస్ ధ్వజమెత్తింది. సభ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన తర్వాత ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ఎంపీల చేత లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారాన్ని ప్రారంభించారు. తొలుత ప్రధాన మంత్రి, సభా నాయకుడు నరేంద్ర మోదీ, ఆ తర్వాత క్యాబినెట్ మంత్రులు వరుసగా ఎంపీలుగా ప్రమాణం చేశారు. ఎంపీగా ప్రధాని మోదీ ప్రమాణం చేసే సమయంలో విపక్ష పార్టీల సభ్యులు రాజ్యాంగం పుస్తకాలు చేతిలో పట్టుకొని నిలబడ్డారు.తొలిరోజు 262 మంది సభ్యులు ప్రమాణం చేయగా, మిగిలిన సభ్యులు మంగళవారం చేయనున్నారు. కాగా, అంతకుముందు ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్ చేత రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు.

# 3 నెలల్లో తేల్చాలి....!



స్పీకర్ అలా చేయలేని పక్షంలో ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలంటూ కోర్టును ఆశ్రయించే అవకాశం ఫిర్యాదుదారులకు ఉంటుందని గుర్తు చేసింది. ఈ మేరకు మహారాష్ట్రలో శివసేన (ఠాక్రే–షిం డే), ఎన్సీపీ (శరద్ పవార్–అజిత్ పవార్) కేసులకు సంబంధించి ఈ ఏడాది మొద ట్లో జరిగిన విచారణలో, 2020లో మణిపూర్‌కు చెందిన ఓ మంత్రి కేసులో సుప్రీం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. స్పీకర్ అధికారాలకు పరిమితులు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' ప్రకారం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకొనే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుంది. అయితే ఈ నిర్ణయాన్ని స్పీకర్ ఈ పరిమిత సమయంలోపు తీసుకోవాలనే నిబంధన గతంలో లేదు. దీంతో రాజకీయ ప్రయోజనాలను అనుసరించి అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగేది. దీనిపై దృష్టిసారించిన సుప్రీంకోర్టు ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని త్వరగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్లకు డెడ్‌లైన్లు విధిస్తున్నది. మహారాష్ట్రలోని ఎన్సీపీని చీల్చి శివసేన (షిండే)–బీజేపీ ప్రభుత్వంలో చేరిన అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేలపై ఎన్సీపీ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా (ఫిబ్రవరి 15) నిర్ణయం తీసుకోవాలని ఆ రాష్ట్ర స్పీకర్‌ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

# 60 జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి.....



**హైదరాబాద్ :** రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ఒకేసారి 44 మంది అధికారులను ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా సుల్తానియాను నియమించింది. ఆయనకు ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శిగా కూడా ఆయన కొనసాగనున్నారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో విడుదలచేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఆ స్థానంలో కొనసాగిన రొనాల్డ్ రోస్‌ను విద్యుత్ శాఖ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ చేశారు.

ఆయనకు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలు కేటాయించారు.చేనేత, హస్తకళల ముఖ్యకార్యదర్శిగా శైలజా రామయ్యను బదిలీ చేశారు. ఆమెకు హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం..
# రక్తదానం చేసే ముందు గుర్తించుకోవాల్సిన విషయాలు...!

మీ రక్తంతో ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి వారి జీవితాన్ని కాపాడొచ్చు. అందుకే రక్తదానాన్ని గొప్ప దానం అని అంటారు. వివిధ ఆరోగ్య సమస్యల కారణంగా..రక్తం లోపంతో బాధపడుతున్న వ్యక్తులకు సహాయం చేయాలనే ఏకైక ఉద్దేశ్యంతో రక్తదానం చేయబడుతుంది. రక్తదాన ప్రక్రియలో ఒక వ్యక్తి సాధారణంగా తన రక్తాన్ని బ్లడ్ బ్యాంక్ లేదా అవసరమైన వారి కోసం రక్తాన్ని సేకరించే సంస్థకు దానం చేస్తాడు. ఈ నేపథ్యంలో రక్తదానంపై అవగాహన పెంచడం, రక్తదానం చేసేలా మరింత మందిని ప్రేరేపించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటాం.అయితే, రక్తదానం చేసే ముందు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. దీనికి సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈరోజు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానానికి సంబంధించిన కొన్ని విషయాలను ఈ ఆర్టికల్ ద్వారా తెలుసుకుందాం. ఎవరు రక్తదానం చేయవచ్చు? ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరు రక్తదానం చేయవచ్చు. అయితే, రక్తదానం చేయడానికి %ఔనూ% ఇచ్చిన కొన్ని ప్రాథమిక మార్గదర్శకాలు ఇప్పుడు చూద్దాం.

1. మీ వయస్సు 18 నుండి 65 సంవత్సరాల మధ్య ఉంటే..మీరు రక్తదానం చేయడానికి అర్హులు.
2. రక్తదానం చేయడానికి మీ బరువు కనీసం 50 కిలోలు ఉండాలి.
3. రక్తదానం చేసేటప్పుడు పూర్తిగా ఆరోగ్యంగా ఉండాలి. మీకు జలుబు, ఫ్లూ, గొంతు నొప్పి, జలుబు, కడుపులో నులిపురుగులు లేదా మరేదైనా ఇన్ఫెక్షన్ ఉంటే రక్తదానం చేయకూడదు.

ఈ పరిస్థితుల్లో రక్తదానం చేయకూడదు

1. మీరు ఇటీవల టాటూ లేదా బాడీ పియర్సింగ్ చేయించుకున్నట్లయితే, రక్తదానం చేసిన తేదీ నుండి 6 నెలల వరకు రక్తదానం చేయకూడదు.
2. ఏదైనా ప్రధాన చికిత్స తర్వాత ఒక నెల వేచి ఉండాలి.
3. రక్తదానం చేయడానికి కనీస హిమోగ్లోబిన్ స్థాయిని అందుకోకపోతే మీరు రక్తదానం చేయకూడదు.

ఇలాంటి వ్యక్తులు రక్తదానం చేయకూడదు

1. గత 12 నెలల్లో అనేక మంది వ్యక్తులతో అసురక్షిత లైంగిక చర్యలో నిమగ్నమై ఉన్నవారు.
2. హెచ్ఐవి (ఎయిడ్స్ వైరస్)కి పాజిటివ్‌గా ఉన్నవారు అర్హులు కాదు.
3. ఒక వ్యక్తి మందులు వాడితే రక్తదానం చేయకూడదు.
4. గర్భవతి, పిల్లలకు పాలు ఇస్తున్న మహిళలు, అబార్షన్ చేయించుకున్న మహిళలు.

# అలోవెరా జ్యూస్ తాగితే ఇన్ని ప్రయోజనాలా...!



అలోవెరా దాదాపు అందరి ఇంట్లో కనిపించే ఒక మొక్క. తక్కువ జాగ్రత్తతో ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. ఇది ఇంటి గాలిని శుద్ధి చేస్తుంది. ఇంటిని అందంగా మార్చడంతోపాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. అలోవెరా జెల్ చర్మ సౌందర్యాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా..అలోవెరా జ్యూస్ తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుంది. విటమిన్ సి, కాల్షియం, మెగ్నీషియం వంటి అనేక విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటాయి. ఈ నేపథ్యంలో అలోవెరా జ్యూస్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురుంచి తెలుసుకుందాం.

**జీర్ణక్రియ సాఫీగా పనిచేస్తుంది**

అలోవెరా భేదిమందు గుణాలు ఉన్నాయి. అంటే..ఇది ప్రేగులను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. దీని రసాన్ని తాగడం వల్ల మలబద్ధకం సమస్య దూరమై పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. ఇది అసిడిటీ , ఉబ్బరం వంటి ఇతర జీర్ణ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఒకవేళ మీరు చాలా కాలంగా మలబద్ధకంతో బాధపడుతున్నట్లయితే..వైద్యుడిని సంప్రదించడం మంచిది.

**రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంచుతుంది**

ప్రీడయాబెటిస్‌తో బాధపడేవారికి అలోవెరా రసం ప్రయోజనకరంగా ఉంటుంది అని చెప్పవచ్చు. దీన్ని తాగడం వల్ల ఫాస్టింగ్ షుగర్ లెవెల్ తగ్గుతుంది. కానీ, దాని సహాయంతో మాత్రమే మధుమేహాన్ని అయితే నివారించలేము. దీని కోసం ఆరోగ్యకరమైన జీవనశైలి చాలా ముఖ్యం. అలాగే మీరు మార్కెట్ నుండి అలోవెరా రసాన్ని కొనుగోలు చేసినట్లయితే..అందులో చక్కెర జోడించబడకూడదని గుర్తించుకోవాలి.

**చర్మానికి ప్రయోజనకరమైనది**

అలోవెరా రసం చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కణాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. అంతేకాకుండా..అలోవెరా మొటిమలను ఎదుర్కోవడంలో కూడా చాలా సహాయపడుతుంది. అలోవెరా జెల్ మొటిమల వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కాకుండా అలోవెరా రసం చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది.

# వీటిని నానబెట్టుకొని తింటే అనేక బెనిఫిట్స్..!



మనం ఉదయం పూట మొదట తినే ఆహారం మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అయితే, మార్నింగ్ తీసుకునే టీ లేదా కాఫీతో రోజుని ప్రారంభించడం జీర్ణక్రియకు ఎంతో సహాయపడుతుంది. మరోవైపు మనం మధ్యాహ్నం, రాత్రికి తీసుకునే ఆహారం అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది ఇలా ఉండగా..కొన్నింటిని రాత్రిపూట నానబెట్టి తింటే అనేక ప్రయోజనాలు ఉంటాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం.

**బాదం :** ప్రతి సీజన్‌లో బాదంపప్పును తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇక వేసవిలో వాటిని నానబెట్టి తినడం ఎంతో మంచిది అని చెప్పవచ్చు. దీని కారణంగా వాటి వేడి ప్రభావం జీర్ణక్రియకు హాని కలిగించదు. చెడు కొలెస్ట్రాల్ లేదా అధిక రక్తపోటు వంటి సమస్యలు కూడా దూరమవుతాయి.

**ఎండుద్రాక్ష :** ఎండుద్రాక్షలో చాలా యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనాలను అందిస్తాయి. అయితే, ఇది నానబెట్టిన తర్వాత తీసుకుంటే..దాని వల్ల కలిగే ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. అంతేకాకుండా నానబెట్టిన ఎండుద్రాక్ష ఆరోగ్యానికి మాత్రమే కాకుండా చర్మం, ఆరోగ్యకరమైన జుట్టుకు కూడా చాలా ముఖ్యమైనది.

**వోట్స్‌జి :** రాత్రంతా నానబెట్టిన ఓట్స్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇలా చేయడం వల్ల అందులో ఉండే స్టార్చ్, యాసిడ్ మొత్తం తగ్గిపోతుంది. ఇది జీర్ణక్రియకు చాలా మంచిది. అటువంటి పరిస్థితిలో మీరు కావాలంటే వాటిని ఉడికించకుండా కూడా తినవచ్చు.

# బొప్పాయి ఆకుల రసం తీసుకోవడం వల్ల కలిగే లెక్కలెన్నని ప్రయోజనాలివే..!



అందరం బొప్పాయి తింటూ ఉంటాం. పసుపు రంగులో ఉండే ఈ పండులో అనేక విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. దీంతో ఇది ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, బొప్పాయి ఆకులు కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా?..అవును బొప్పాయి ఆకులలో అనేక విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. ఇవి మనిషి అనేక ఆరోగ్య సంబంధిత సమస్యలను దూరం చేయడంలో సహాయపడతాయి. ఈ నేపథ్యంలో బొప్పాయి ఆకుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

**రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది**

బొప్పాయి ఆకులు రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. ఇవి ప్యాంక్రియాస్‌లోని ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను రక్షిస్తాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో చాలా సహాయపడుతుంది. అందువల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.

**జీర్ణశక్తి మెరుగుపడుతుంది**

బొప్పాయి ఆకులలో పపైన్, ఫైబర్ ఉంటాయి. ఇవి సరైన జీర్ణక్రియను నిర్వహించడానికి చాలా సహాయపడతాయి. ఇది గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలను తొలగిస్తుంది. ఫైబర్ ప్రేగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. పాపైన్ ప్రోటీన్ల విచ్ఛిన్నానికి సహాయపడుతుంది. అందువల్ల బొప్పాయి ఆకులు జీర్ణక్రియకు మేలు చేస్తాయి.

**డెంగ్యూతో పోరాడటానికి ఉపయోగపడుతుంది**

ఒక వ్యక్తికి డెంగ్యూ వచ్చినప్పుడు అతని ప్లేట్‌లెట్స్ తగ్గడం ప్రారంభమవుతుంది. కొన్ని సందర్భాల్లో ప్లేట్‌లెట్స్ పరిమాణం గణనీయంగా పడిపోతుంది. దీని కారణంగా వ్యక్తి చనిపోవచ్చు. అటువంటి పరిస్థితిలో బొప్పాయి ఆకులు ప్లేట్‌లెట్లను పెంచడంలో సహాయపడతాయి. త్వరగా మనిషిని కోలుకునేలా చేస్తుంది.

# పుచ్చకాయను ఉప్పుతో కలపి తింటున్నారా?..కలిగే లాభ, నష్టాలు ఇవే...!



వేసవి కాలంలో పుచ్చకాయని తినడానికి అందరూ ఇష్ట పడుతారు. దీన్ని తినడం వల్ల శరీరంలో నీటి లోపం తొలగిపోతుంది.

ఇందులో ఉండే మినరల్స్, విటమిన్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. చాలా మంది పుచ్చకాయను రసం చేసుకొని తాగుతూ ఉంటారు. అంతేకాకుండా పుచ్చకాయపై ఉప్పు చల్లి తినడానికి చాలా మంది ఇష్టపడతారు. దీనివల్ల పుచ్చకాయలో తియ్యదనం పెరుగుతుందని నమ్మకం. అయితే ఇలా చేయడం వల్ల ఆరోగ్యానికి చాలా హాని కలుగుతుందని కొందరు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అటువంటి పరిస్థితిలో మనం పుచ్చకాయలో ఉప్పు వేసి తినాలా వద్దా అనేది ఈ ఆర్టికల్ ద్వారా తెలుసుకుందాం. పుచ్చకాయలో ఉప్పు కలిపి తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఉప్పు పుచ్చకాయ చేదును తగ్గించి తీపిని పెంచుతుంది. అంతేకాకుండా ఆహార ప్రియులకి అద్భుతమైన రుచిని కలిగిస్తుంది.

ఉప్పు పుచ్చకాయ నుండి నీటిని బయటకు తీస్తుంది. దీంతో పుచ్చకాయ మరింత జ్యూసిగా ఐతుంది. పుచ్చకాయపై ఉప్పు చల్లిన తర్వాత తినడం వల్ల కలిగే నష్టాలు పుచ్చకాయలో ఉప్పు కలిపి తినడం వల్ల శరీరంలో సోడియం పరిమాణం పెరుగుతుంది. అయితే, ఇది అనేక సమస్యలను కలిగిస్తుంది. దీని కారణంగా రక్తపోటు పెరగవచ్చు. ఉప్పు ఎక్కువగా ఉండటం వల్ల బీపీ రోగుల సమస్యలు కూడా పెరుగుతాయి. దీని కారణంగా.. పోషకాహార సమస్యలు కూడా తలెత్తుతాయి.


# సైక్లింగ్ లేదా వాకింగ్.. ?
# ఆరోగ్యానికి ఏది మంచిది.......?

సైక్లింగ్, వాకింగ్ రెండూ అత్యుత్తమ శారీరక కార్యకలాపాలు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తూ, బరువుని తగ్గిస్తూ, మానసిక ఆరోగ్యంతో సహా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇప్పుడు ఈ ఆర్టికల్ ద్వారా సైక్లింగ్, వాకింగ్ ఏది మంచిదో తెలుసుకుందాం. వాకింగ్ అనేది సహజమైన వ్యాయామం. ఇది మోకాలి ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది. అంతేకాకుండా ఇది కీళ్ల ఫ్లెక్సిబిలిటీని నిర్వహించడానికి, మోకాళ్ల చుట్టూ ఉన్న కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. వాకింగ్ మోకాలి కీళ్లపై ఒత్తిడిని తగ్గించడానికి ఇది చాలా ముఖ్యమైన బరువును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇక సైక్లింగ్ విషయానికి వస్తే..మీరు సైకిల్ నడుపుతున్నప్పుడు, మీ పాదాలు పెడల్స్‌తో టచ్‌లో ఉంటాయి. ఇది వాకింగ్ తో పోలిస్తే..మోకాలి కీళ్లపై ఒత్తిడిని తగ్గిస్తుంది. మోకాలి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సైక్లింగ్ ఎంతో సహాయపడుతుంది. సైకిల్ తొక్కడం లేదా వాకింగ్ చేయడం రెండూ మోకాళ్లను బలోపేతం చేయడానికి ఎంతో ఉపయోగపడతాయి. ఒకవేళ మీకు మోకాళ్లలో తీవ్రమైన నొప్పి



ఉంటే..నడక మంచి ఎంపిక అని చెప్పవచ్చు. అయితే, మీ మోకాళ్లు ఆరోగ్యంగా ఉంటే..మీరు సైకిల్ తొక్కవచ్చు. మోకాళ్లను బలోపేతం చేయడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ముఖ్యం. మీకు మోకాళ్లలో నొప్పి ఉంటే..మీకు సైక్లింగ్, వాకింగ్ లో ఏది ఉత్తమమో తెలుసుకోవడానికి వైద్యుడిని లేదా ఫిజియోథెరపిస్ట్‌ను సంప్రదించడం చాలా మంచిది.

# మీ జుట్టు చిట్లిపోతోందా?..
# పెరుగుతో మెరిసే జుట్టు..




జుట్టు సంబంధిత సమస్యలను తగ్గించుకోవడానికి, మహిళలు అనేక రకాల సౌందర్య సాధనాలు, ఖరీదైన జుట్టు సంరక్షణ చికిత్సలను ఆశ్రయిస్తారు. అయితే, ఈ చికిత్సలు అన్ని సమయాలలో తీసుకోవడం సరికాదు. ఎందుకంటే అవి ఖరీదైనవి. అలాగే పదేపదే హెయిర్ స్పా తీసుకోవడం వల్ల జుట్టు మరింత దెబ్బ తినే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో పెరుగు హెయిర్ స్పా క్రీమ్ తయారుచేసే విధానాన్నితెలుసుకుందాం. అయితే, జుట్టులో చుండ్రు సమస్యను నియంత్రించే అనేక గుణాలు పెరుగులో ఉంటాయి. దీనితో పాటు ఇది జుట్టు పెరుగుదలను పెంచుతుంది. అంతేకాకుండా జుట్టు ని సిల్కీగా, మెరిసేలా చేస్తుంది. ఇప్పుడు పెరుగు హెయిర్ స్పా క్రీమ్‌ను తయారుచేసే పద్ధతిని ఈ ఆర్టికల్ ద్వారా తెలుసుకుందాం.

**తయారీకి కావలసిన పదార్థాలు:**

పెరుగు – 1 కప్పు
ఆవు పాలు – 1/2 కప్పు
తేనె – 2 స్పూన్లు
గుడ్డు – 1
ఆలివ్ నూనె – 1 టీస్పూన్ పెరుగు హెయిర్ స్పా క్రీమ్ ఎలా తయారు చేయాలి: పెరుగు హెయిర్ స్పా క్రీమ్ ని తయారు చేయడానికి, ముందుగా ఒక గిన్నెలో పెరుగు వేయండి. తర్వాత దానిని బాగా కలపండి. దీని తర్వాత అందులో ఆవు పాలు, తేనె, గుడ్డు వేయండి. తర్వాత వీటన్నింటిని బాగా మిక్స్ చేసి చిక్కని పేస్ట్ లా తయారు చేసుకోవాలి. దీని తర్వాత 1 టీస్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. దీంతో పెరుగు హెయిర్ స్పా క్రీమ్ రెడీ అయినట్లే.





# భారతీయుడు-2 మూవీ ట్రైలర్ వచ్చేసింది..!




విశ్వనటుడు కమల్ హాసన్ నటిస్తున్న చిత్రం భారతీయుడు-2 చిత్రం. మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను మేకర్స్ మంగళవారం విడుదల చేశారు. కమల్, దర్శకుడు శంకర్ కాంబినేషనల్‌లో 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' రూపొందుతున్నది. జూలై 12న ప్రేక్షకుల ప్రపంచవ్యాప్తంగా విడుదలకానున్నది. ఈ క్రమంలో తాజాగా ముంబయిలో జరిగిన కార్యక్రమంలో అన్ని భాషల్లో మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న రిలీజ్ కానుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నాయి. భారతీయుడు-2 మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సేనాపతిగా 'భారతీయుడు' చిత్రంలో కమల్ హాసన్ మెప్పించారు. ఈ మూవీకి దీనికి కొనసాగింపుగా 'భారతీయుడు-2' రానున్నది. తాజాగా ఇదే కాన్సెప్ట్‌తో మూవీని తెరకెక్కుతుండగా.. మూవీపై భారీ అంచనాలున్నాయి. సేనాపతిగా కమల్ మరోసారి బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసేందుకు సిద్ధమవుతున్నారు. ట్రైలర్ విషయానికి వస్తే సిద్ధార్థ్ ఓ స్టూడెంట్. సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తుంటాడు. దీంతో అతన్ని పోలీసులు అరెస్టు చేస్తారు. ఎన్నో అన్యాయాలు జరుగుతున్నాయని.. మళ్లీ ఆయన రావాలంటూ ట్విట్టర్‌లో ట్రెండ్ చేస్తారు. దీంతో సేనాపతి మరోసారి ఎంట్రీ ఇస్తాడు. ఇక ఆ తర్వాత సేనాపతి ఏం చేశాడన్నది మూవీలోనే చూడాలి. అయితే, విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందరినీ ఆకట్టుకున్నాయి. మూవీని అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ తో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్వహించగా.. సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్‌జే సూర్యా, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారు. మూవీకి చిత్రానికి అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్ని అందించారు.

# ఆది సాయికుమార్ విజువల్ వండర్ షణ్ముఖ షూటింగ్ పూర్తి



వైవిధ్యమైన చిత్రాలను, విభిన్నమైన కథలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. ఆ కోవలోనే రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ చిత్రం షణ్ముఖ. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. శాసనసభ అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన చివరి షెడ్యూల్‌తో ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు మట్లాడుతూ ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. విజువల్ వండర్‌లా, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్రం కోసం ఎంతో రిచ్‌గా వేసిన ఓ సెట్‌లో చివరి షెడ్యూల్‌ను పూర్తిచేసాం. కేజీఎఫ్, సలార్ చిత్రాలకు తన సంగీతంతో ప్రాణం పోసిన రవి బసూర్ ఈ చిత్రానికి స్టనింగ్ మ్యూజిక్‌ను అందిస్తున్నారు. ప్రస్తుతం అత్యున్నత సాంకేతిక నిపుణులతో నిర్మాణనంతర పనులు మొదలుకానున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఓ వండర్‌ఫుల్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకరావడానికి ప్రయత్నిస్తున్నాం. తప్పకుండా ఈ చిత్రం ఆది కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది అన్నారు.


# పోరుకు సై అంటోన్న ధనుష్, ఎస్‌జే సూర్య.. రాయన్ నయా లుక్ వైరల్

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న స్టార్ యాక్టర్లలో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ఒకడు. ఓ వైపు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేర సినిమాలో నటిస్తుండగా.. షూటింగ్ దశలో ఉంది. మరోవైపు స్వీయ దర్శకత్వంలో ధనుష్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ క్రేజియెస్ట్ మూవీ రాయన్. నార్త్ మద్రాస్ బ్యాక్ డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో జులై 16న గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. ఇదిలా ఉంటే తాజాగా మేకర్స్ మరో లుక్ విడుదల చేశారు. రాయన్‌లో కీ రోల్‌లో నటిస్తోన్న ఎస్‌జే సూర్య, హీరో ధనుష్ పోరుకు సై అంటోన్న స్టన్నింగ్ లుక్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తోంది. రాయన్‌లో అపర్ణ బాలమురళి, దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, విష్ణువిశాల్, కాళిదాస్ జయరామన్, సందీప్ కిషన్, సెల్వ రాఘవన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. డీ50వగా వస్తోన్న రాయన్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ మూవీని తెలుగులో ఏసియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ రిలీజ్ చేయనున్నట్టు ఇప్పటికే అప్‌డేట్ బయటకు వచ్చింది. రాయన్‌కు ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ధనుష్ మరోవైపు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటిస్తోన్న కుబేర చిత్రీకరణ దశలో ఉంది.




# గెట్ రెడీ అంటోన్న కార్తీ.. సర్దార్ 2 షురూ అయ్యే టైం ఫిక్స్..!

కథను నమ్మి సినిమాలు చేసే టాలెంటెడ్ స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ నటుడు కార్తీ. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం సర్దార్. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్ల రాబట్టింది. ఈ మూవీకి సీక్వెల్ సర్దార్ 2 కూడా వస్తుందని తెలిసిందే. మిషన్ కంబోడియా నేపథ్యంలో సర్దార్ 2 ఉ ండబోతుందని తెలియజేస్తూ ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన వీడియో నెట్టింట్లో వైరల్ అవుతోంది. చాలా రోజుల తర్వాత సర్దార్ 2 టీం నుంచి ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. సీక్వెల్ షూటింగ్‌కు అంతా సిద్దమైందన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం జులైలో చెన్నైలో వేసిన భారీ సెట్‌లో సర్దార్ 2 షూటింగ్ షురూ కానుందట. అంతేకాదు కథానుగుణంగా కజకిస్తాన్, అజర్‌బైజాన్, జార్జియాలో సర్దార్ 2 షూట్ కొనసాగించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రంలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ కీలక పాత్రలో కనిపించబోతున్నట్టు తెలుస్తోండగా.. దీనికి సంబంధించి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కార్తీ మరోవైపు నలన్ కుమారస్వామి డైరెక్షన్‌లో వా వాథియారే సినిమా చేస్తున్నాడు. కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇటీవలే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై కేఈ జ్ఞానవేళ్ రాజా నిర్మిస్తున్నారు.



# 54 నిత్యావసర మందులపై ధరలు తగ్గింపు.....!



మీరు మందుల ఖర్చులతో ఇబ్బంది పడుతున్నారా?..అయితే ఈ వార్త మీకు ఊరటనిస్తుంది. అదేంటంటే?..ప్రభుత్వం కొన్ని అవసరమైన మందుల రేట్లను తగ్గించింది. చెవి, గుండె, షుగర్ వ్యాధుల చికిత్సలో ఉపయోగించే మందులు ఇప్పుడు తక్కువ ధరలకు అందుబాటులో ఉండనున్నాయి. వీటన్నింటితో పాటు మల్టీవిటమిన్ మందులు కూడా తక్కువ ధరలకు ప్రజలకు అందుతాయి. దీని గురించి పూర్తిగా ఈ ఆర్టికల్ ద్వారా తెలుసుకుందాం. ఇటీవల నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) సమావేశం నిర్వహించింది. ఈ సమయంలో ఔషధాల ధరలను తగ్గించడం గురించి సమావేశంలో చర్చ జరిగింది. కాగా, దానిపై ప్రభుత్వం ఆమోదించింది. ఈ నేపథ్యంలో 54 అవసరమైన మందులతో పాటు, NPPA 8 ప్రత్యేక మందుల ధరలను కూడా తగ్గించారు. వీటిలో గుండె, యాంటీబయాటిక్స్, మల్టీ విటమిన్లు, విటమిన్ D, చెవి, మధుమేహం ఇలా అనేక ఇతర మందులు ఉన్నాయి. అయితే, ఔషధాల ధరలను ప్రభుత్వం గత నెలలో అంటే మేలో కూడా తగ్గించిన విషయం తెలిసిందే. అప్పట్లో 41 నిత్యావసర మందులు, 6 ప్రత్యేక మందుల ధరలను తగ్గించారు. వీటిలో అసిడిటీ, గ్యాస్, పెయిన్ కిల్లర్, ఎలర్జీ, కాలేయానికి సంబంధించిన మందులు ఉన్నాయి. ఇవే కాకుండా మధుమేహం మందులు, యాంటీబయాటిక్స్, మల్టీ విటమిన్లు కూడా ఉన్నాయి. నిత్యావసర మందుల ధరలను తగ్గించడం వల్ల సామాన్యుల జేబులపై భారం తగ్గే అవకాశం ఉంది. గుండె, మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య దేశంలో చాలా ఎక్కువగా ఉంది. గణాంకాలను విశ్వసిస్తే..భారతదేశంలో 10 కోట్ల మందికి పైగా మధుమేహ రోగులు ఉన్నారు. వారు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి ప్రతిరోజూ మందులు తీసుకోవాలి. ఇటువంటి పరిస్థితిలో మధుమేహ రోగులు మందుల ధరలను తగ్గించడం ద్వారా చాలా ప్రయోజనం పొందవచ్చు.


# ఆదాయపు పన్నులో స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి పెంచొచ్చు....

**హైదరాబాద్ :** పన్ను చెల్లించేవారికి ఊరటనిచ్చే కబురును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. నిర్మలా సీతారామన్ ఇప్పటికే బడ్జెట్ విషయంలో పబ్లిక్ కన్సల్టేషన్ చేపట్టారు. 2023 బడ్జెట్ లో రూ. 50000 జీతగాళ్లకు, పింఛనుదారులకు స్టాండర్డ్ డిడక్షన్ ప్రవేశపెట్టారు. ఇంకా ట్యాక్సేబుల్ ఇన్కమ్ లో సెక్షన్ 87ఏ కింద రూ. 7 లక్షల వరకు రిబేట్ ఇచ్చారు. వ్యక్తుల ట్యాక్సేబుల్ ఇన్కమ్ రూ. 3 లక్షల పైబడిన వారు 5 శాతం ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి పెంచడం వల్ల జీతగాళ్లకు, ఎక్కువ ఆదాయం వారికి ప్రయోజనం చేకూరగలదు స్టాండర్డ్ డిడక్షన్ ను మొదట రూ 40000కు ప్రవేశపెట్టినప్పటికీ 2019లో దానిని రూ. 50000 కు పెంచారు. అయితే నేటి జీవన ప్రమాణ స్థాయిని బట్టి చూస్తే ఇదో లెక్కలోకి రాదని తేలుతోంది. అందుకే కనీస పరిమితిని రూ. 1 లక్షకు పెంచాలని చాలా మంది కోరుతున్నారు.

ఇంకా ట్యాక్సేబుల్ ఇన్కమ్ లో సెక్షన్ 87ఏ కింద రూ. 7 లక్షల వరకు రిబేట్ ఇచ్చారు. వ్యక్తుల ట్యాక్సేబుల్ ఇన్కమ్ రూ. 3 లక్షల పైబడిన వారు 5 శాతం ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.



# సరికొత్త రికార్డు స్థాయిని తాకి చివరికి నష్టాల్లోకి నిఫ్టీ




ముంబై: బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు శుక్రవారం సరికొత్త రికార్డు స్థాయిని అందుకున్నాయి. ఐటి స్టాకుల్లో కొనుగోలు ఒత్తిడి, విదేశీ నిధుల ప్రవాహం కొనసాగడంతో మార్కెట్ సూచీలు పెరిగాయి. సెన్సెక్స్ 30 కంపెనీలలో టెక్ మహీంద్ర, ఇన్ఫోసిస్, హెచ్ సిఎల్ టెక్నాలజీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో, బజాజ్ ఫిన్సర్వీస్, పవర్ గ్రిడ్ , ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడగా, టాటా స్టీల్, హిందుస్థాన్ యూనిలీవర్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్ డిఎఫ్ సి బ్యాంక్ ప్రధానంగా నష్టపోయాయి. విదేశీ సంస్థాగత మదుపరులు(ఎఫ్ఐఐలు) రూ. 415.30 కోట్ల ఈక్విటీలను గురువారం కొన్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లు కన్సాలిడేషన్ దశను కొనసాగించొచ్చని తెలుస్తోంది. మార్కెట్ బుల్లిష్ గానే ఉందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్ మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయ్ కుమార్ తెలిపారు. ఇది రాసే వేళకు సెన్సెక్స్ 76830. నిఫ్టీ 23416 వద్ద నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

# జులై 1 నుంచి పెరుగనున్న హీరో మోటో ద్విచక్ర వాహనాల ధరలు



ముంబై: హీరో మోటో కార్పొరేషన్ తన ఎంపిక చేసిన ద్విచక్ర వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. అయితే ఏ మోడల్ మీద ఎంత ధరను పెంచనున్నది ప్రస్తుతానికి అధికారికంగా వెల్లడించలేదు.

ఒకవేళ పెంచేట్టయితే రూ. 1500 వరకు పెంచే అవకాశం ఉంది. మోడల్ ను బట్టి ధర పెంపు ఉండనున్నది. హీరో మోటార్ సైకిళ్లలో స్ప్లెండర్ ప్లస్, హెచ్ఎఫ్ డీలక్స్, హెచ్ఎఫ్ 100, ప్యాషన్ ప్లస్, ప్యాషన్ ఎక్స్ టెక్, సూపర్ స్ప్లెండర్, ఎక్స్ టెక్, గ్లామర్ ఎక్స్ టెక్, ఎక్స్ ట్రీమ్ 125 ఆర్, ఎక్స్ ట్రీమ్ 4వి, ఎక్స్ ట్రీమ్ 200 4వి, ఎక్స్ ట్రీమ్ 160 ఆర్, మావ్రిక్ 440 వంటివి ఉన్నాయి. స్కూటర్లలో హీరో డెస్టినీ ప్రైమ్, డెస్టినీ 125 ఎక్స్ టిఈసి, జూమ్, ప్లెజర్ ప్లస్ ఎక్స్ టెక్ ఉన్నాయి.

# ఆమ్టెక్ గ్రూప్, డైరెక్టర్ల ఆస్తులపై ఈడి దాడులు

ముంబై: మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈడి గురువారం ఆమ్టెక్ గ్రూప్, దాని డైరక్టర్ల నివాసాలపై గురువారం సోదాలు జరిపింది. కంపెనీ, దాని ప్రమోటర్లు రూ. 20,000 కోట్లకు పైగా బ్యాంకు రుణం మోసానికి పాల్పడినందున ఈడి దర్యాప్తు జరుపుతోంది. సిబిఐ ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేయగా ఆ తర్వాత ఈడి దర్యాప్తులోకి దిగింది.

ఆమ్టెక్ గ్రూప్, అరవింద్ ధామ్, గౌతమ్ మల్హోత్రకు చెందిన వ్యాపారాలు , నివాస స్థలాలపై దాడులు జరిగాయి. లిస్టెడ్ కంపెనీల షేర్లలో అవకతవకలు జరిగాయని, ఆడిటర్ల సహకారంతో ఫైనాన్షియల్ రికార్డులు తారుమారు చేసి అధిక రుణాలు పొందడానికి మోసానికి పాల్పడ్డారని ఆరోపణ. రుణ




నిధులను అక్రమంగా రియల్ ఎస్టేట్, విదేశీ పెట్టుబడులు, కొత్త వెంచర్ల వైపుకు మళ్లించినట్టు సమాచారం.

# ఐటిఆర్ దాఖలు చేయాల్సిందెవరు...?




మీ స్థూల ఆదాయం బేసిక్ ఎక్సెంప్షన్ లిమిట్ దాటినట్లయితే ఇన్ కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేయాల్సిందే. దీనర్థం మీరు ఆదాయపు పన్ను కట్టాలని కాదు. ఇన్ కమ్ ట్యాక్స్ చట్టం 1961కి చెందిన సెక్షన్ 87ఏ కింద రూ. 5 లక్షలు దాటితే (పాత విధానం), లేక రూ. 7 లక్షలు దాటితే(కొత్త విధానం) మాత్రమే పన్ను కట్టాలి. ఈ విధంగా ట్యాక్స్ రిబేట్ ఉంది. మీరు పాత విధానం ప్రకారం రూ. 12500 వరకు గరిష్ఠంగా రిబేట్ పొందవచ్చు. అలాగే కొత్త విధానం ప్రకారం రూ. 25000 వరకు గరిష్ఠంగా రిబేట్ పొందవచ్చు. కనుక మీరు నిర్ధారిత పరిమితి వరకు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన పనిలేదు. అయితే మీ ఆదాయం ట్యాక్స్ రిబేట్ మూలంగా ట్యాక్స్ లయబిలిటీ 'నిల్' అయినప్పటికీ మీరు ఇన్ కమ్ ట్యాక్స్ రిటర్న్(ఐటిఆర్) దాఖలు చేయాల్సి ఉంటుంది. "సాధారణంగా ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఒకవేళ పన్ను చెల్లించనవసరం లేకుంటే అసలు ఐటిఆర్ దాఖలు చేయాల్సిన పనిలేదు అనుకుంటారు" అని ట్యాక్స్ ప్లానర్ డాట్ కామ్ సిఈవో, కోఫౌండర్ సుధీర్ కౌశిక్ తెలిపారు. ఆడిట్ అవసరం లేని వారు ఐటిఆర్ ను దాఖలు చేయాల్సిన గడువు 31 జులై 2024. ఇది ఆర్థిక సంవత్సరం 2023-24(అసెస్మెంట్ ఇయర్ 2024-25)కి. ఆదాయపు పన్ను మినహాయింపు శ్లాబ్ లు ఈ విధంగా ఉన్నాయి: 60 ఏళ్ల కన్నా తక్కువ వయస్సు ఉన్నవారికి: రూ. 2.5 లక్షల వరకు 60 నుంచి 80 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారికి: రూ. 3.0 లక్షల వరకు80 ఏళ్ల పైబడిన వారికి: రూ. 5.0 లక్షల వరకు.

# పేటీఎం ఉద్యోగులకు ఉద్వాసన...




**న్యూఢిల్లీ :** పేటీఎం లేఆఫ్(ఉద్యోగులని పెద్ద ఎత్తున తొలగించడం) ప్రకటించింది. అయితే ఎంత మంది ఉద్యోగులను తొలగించింది మాత్రం వెల్లడించలేదు. ఇతర సంస్థల్లో ఉద్యోగం పొందేందుకు సాయపడుతున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంకుపై రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన చర్యల నేపథ్యంలో ఉద్యోగ కోతలు తప్పడం లేదు. పెండింగ్ లో ఉన్న బోనస్లను సైతం విడుదల చేసింది. పేటీఎం కు పెరిగిన నష్టాల కారణంగానే ఉద్యోగుల ఉద్వాసనకు కారణం.

# సరికొత్త గరిష్ఠ రికార్డుకు ఈక్విటీ మార్కెట్



ముంబై: మూడు రోజుల విరామం తర్వాత దేశీయ ఈక్విటీ మార్కెట్లు సరికొత్త రికార్డులను సాధించాయి. ప్రారంభంలోనే ర్యాలీ కనపడింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతో సరికొత్త గరిష్ఠాలను తాకాయి. సెన్సెక్స్ 308.37 పాయింట్లు లేక 0.40 శాతం పెరిగి 77301.14 వద్ద ముగిసింది. కాగా నిఫ్టీ 92.31 పాయింట్లు లేక 0.39 శాతం పెరిగి 23557.90 వద్ద ముగిసింది.

# కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్సీ పదవి నాకు ఎందుకు: జీవన్ రెడ్డి



హైదరాబాద్: 'గత కొన్ని సంవత్సరాల నుంచి ఎవరి మీద కొట్లాడానో, వారినే నాకు ఒక్క మాట కూడా చెప్పకుండా కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడం మంచిది కాదు' అని కాంగ్రెస్ ఎంఎల్ సి జీవన్ రెడ్డి మండిపడ్డారు. జగిత్యాల బిఆర్ఎస్ ఎంఎల్ఎ సంజయ్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుంది ఇప్పుడు పార్టీలో జరుగుతున్న పరిణామాలు చూసి కాంగ్రెస్ కార్యకర్తలు మనస్తాపానికి గురై బాధ పడుతున్నారన్నారు. సోమవారం ఉదయం పత్రికల్లో చూసి జగత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేరిన వార్త తెలుసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. 40 ఏళ్ల తన సీనియారిటీకి అధిష్టానం ఇచ్చే గౌరవం ఇదేనా ధ్వజమెత్తారు. ఇంకా తనకు కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్సీ పదవి ఎందుకు అని ప్రశ్నించారు. శాసనసభలో సంఖ్యా బలం పెంచుకోవడం కోసం ఏకపక్షంగా ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నామని చెప్పడం సరికాదన్నారు. కానీ ఆ చేరిక అనేది ఆ ప్రాంత కార్యకర్తల మనోభావాలు గౌరవించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదని హితువు పలికారు. జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి మంత్రి శ్రీధర్ బాబు బుజ్జగించారు. కాంగ్రెస్ పార్టీకి జీవన్ చేసిన సేవలు వెలకట్టలేనివని, జీవన్ రెడ్డికి న్యాయం జరిగేలా సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఇన్ ఛార్జీ దీపాదాస్ మున్షీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# పోచారం లాంటి వారు పార్టీ మారితే నష్టమేమీ లేదు: కెసిఆర్



హైదరాబాద్: పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి వారు పార్టీ మారినంత మాత్రన బిఆర్ఎస్ పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదని, అలాంటి వాటిని పట్టించుకోవద్దని ఆ పార్టీ అధినేత కెసిఆర్ అన్నారు. మంగళవారం ఆయన ఫామ్ హౌస్‌లో పార్టీ ఎంఎల్ఏ లు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ హయాంలో ఇలాంటివి ఎన్ని జరిగినా భయపడలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్‌కు మంచి రోజులు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంఎల్ఏ లు, ఎంఎల్ సి లు, నేతలతో తరుచూ సమావేశమవుతానన్నారు. ఈ భేటీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, కెపి. వివేకానంద గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్ రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, ఇతర సీనియర్ నేతలు భేటీ అయ్యారు. వారితో కలిసి కెసిఆర్ లంచ్ చేశారు.

# లీటరు పాలపై రూ. 2 పెంచేసిన కర్నాటక




బెంగళూరు: కర్నాటక మిల్క్ ఫెడరేషన్ (కెఎంఎఫ్) మంగళవారం లీటరు పాలకు రూ. 2 పెంచింది. అంతేకాదు ఇప్పుడున్న 500 మి.లీ, 1000 మి.లీ ప్యాకెట్లకు అదనంగా 50 మి.లీ వినియోగదారులకు ఇవ్వనున్నది. ఈ మార్పుతో నందినీ 550 మి.లీ టోన్డ్ మిల్క్(బ్లూ) రూ. 24, 1050 మి.లీ ప్యాకెట్ రూ. 44 కానున్నది. ఏడాదిలో ఇలా పాల ధరను పెంచడం ఇది రెండోసారి. కాగా కొత్తగా పెంచిన ధరలు రేపటి నుంచి(బుధవారం) అమలులోకి రానున్నది. గతంలో 2023 జులైలో లీటరు పాలకు రూ. 3 పెంచారు. కాగా కర్నాటక మిల్క్ ఫెడరేషన్ ఇతర ఉత్పత్తులు అంటే పెరుగు తదితర పాల పదార్థాల ధరలలో మాత్రం ఎలాంటి మార్పు ఉండబోదు. స్టాకులో ఉన్న ప్యాకట్లపై ఉన్న రేట్లే వాటికి వర్తిస్తాయని, అవి అయిపోయాక వచ్చే కొత్త స్టాకు మీదే ధరల ప్రభావం ఉంటుందని కర్నాటక పాల సమాఖ్య తెలిపింది. కర్నాటక పాల ధరలు ఇతర రాష్ట్రాలు... కేరళ, ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తో పోల్చుకుంటే తక్కువేనని కర్నాటక మిల్క్ ఫెడరేషన్ పేర్కొంది. ఇదిలావుండగా కర్నాటకలోని ప్రతిపక్ష బిజెపి నాయకుడు ఆర్. అశోక్ స్పందిస్తూ "నందిని పాల ధరలను పెంచేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారంలోకి వచ్చిన 13 నెలలలోనే ఇలా పాల ధర పెంచడం ఇది రెండోసారి. గత ఆగస్టులో రూ. 3 లీటరుకు పెంచారు. ఇప్పుడు మళ్లీ లీటరుకు రూ. 2 పెంచారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి వర్గం వారు ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధర పెంపుతో సతమతమవుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో పుండు మీద ఉప్పు చల్లినట్టు పేద వారిపై పాల ధర రుద్దారు. మీకు పేద, మధ్య తరగతి వారిపై ఏమాత్రమైనా భావోద్వేగం ఉంటే వెంటనే పెంచిన ధర ఉత్తర్వును వెంటనే ఉపసంహరించండి" అన్నారు.

# లోకేష్ ను కలిసిన హనుమవిహారి

**విజయవాడ:** తిరుపతికి చెందిన ఓ వైసీపీ నేత కుమారుడు ఆంధ్రా టీంలో ఉన్నారని ఆయనను ఏదో అన్నారని కెప్టెన్ పదవి నుంచి హనుమ విహారిని తొలగించిన అంశం ఎన్నికలకు ముందు హాట్ టాపిక్ అయింది. దీంతో ఆంధ్రాకే ఆడకూడదని విహారి నిర్ణయించుకున్నారు. అయితే ఆయనకు ఇతర రాష్ట్రాల టీముల్లో ఆడేందకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంది. కానీ వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎన్వోసీ జారీ చేయలేదు. ఎన్నికల ఫలితాల్లో వైసీపీ ఘోర ఓటమి ఖాయమని తేలడంతో.. కౌంటింగ్ రోజునే ఆ ఎన్వోసీ సర్టిఫికెట్ జారీ చేశారు.ఏసీపీలోని అంశాలపై మాట్లాడేందుకు క్రికెటర్ హనుమ విహారి మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ఆ తర్వాత లోకేష్ సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేశారు. మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగా అవమానకర రీతిలో ఆంధ్రా క్రికెట్ జట్టు కెప్టెన్సీని వదులుకున్న టీమిండియా స్టార్ క్రికెటర్, తెలుగు తేజం హనుమ విహారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విశేష గౌరవంతో తిరిగి స్వాగతం పలుకుతున్నదని ప్రకటించార.? క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు అనే ప్రాథమిక సూత్రాన్ని కూడా మర్చిపోయి ప్రవర్తించిన వారిని ప్రజలు తిరస్కరించారన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో నిందితుడైన పి.శరత్ చంద్రారెడ్డిని ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమించుకోవడంతో గత ప్రభుత్వం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ లో 'రాజకీయ క్రీడ' మొదలుపెట్టింది. తమ పార్టీ నాయకుడి కుమారుడు, జట్టులో 17వ ఆటగాడు అయిన కుంట్రపాకం పృధ్వీరాజ్ ను ప్రోత్సహించేందుకు అసమాన ప్రతిభాపాటవాలు ఉన్న హనుమ విహారి లాంటి క్రికెటర్ ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తీవ్రంగా వేధించింది, అవమానించిందని గుర్తు చేశారుఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రవర్తించిన తీరుతో విసిగిపోయిన హనుమ విహారి కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే చంద్రబాబు , పవన్ కల్యాణ్ , తాను కూడా స్పందించి హనుమ విహారికి అండగా ఉన్నామన్నారు. క్రికెట్ అభిమానులు ఎందరో హనుమ విహారికి సంఘీభావం తెలిపారు. హనుమ విహారి తన క్రికెట్ అనుభవాన్ని ఇతరులకు నేర్పేందుకు కూడా ఆనాటి వ్యవస్థ అడ్డుపడిందన్నారు. రాజకీయాలకు అతీతంగా క్రీడలను ప్రోత్సహించడంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ముందుంటుందని లోకేష్ హామీ ఇచ్చారు. అన్ని ఆటల్లో క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటాం. క్రికెటర్ హనుమ విహారికి పూర్తి న్యాయం చేసేందుకు మాట ఇచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

# కరీంనగర్ లో ప్రమాణాల రాజకీయం

**కరీంనగర్:** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకుల మధ్యలో సవాళ్లు ప్రతి సవాళ్లు కొనసాగుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ పై హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపణలు చేయగా.. కౌశిక్ రెడ్డిపై చేసిన ఆరోపణలు ఆధారాలతో నిరూపిస్తానని.. చెల్పూరు హనుమాన్ దేవాలయానికి రావాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రణవ్ సవాల్ విసిరారు. దీంతో ఇరు పార్టీల నేతలు కార్యకర్తలు హనుమాన్ దేవాలయానికి వెళ్లనుండడంతో పోలీసులు శాంతి భద్రతల దృష్ట్యా ఇరువురిని హౌస్ అరెస్టు చేశారు. కానీ, కౌశిక్ రెడ్డి తన ఇంటి వద్ద ఒంటిపై నీళ్లు పోసుకొని తడి బట్టలతో దేవుడిపై ప్రమాణం చేశారు. తాను తన జీవితంలో ఎలాంటి అవినీతి చేయలేదని తేల్చి చెప్పారు. హుజూరాబాద్ నియోజక వర్గం మీదుగా ఖమ్మంకు ఫ్లై యాష్ అధిక లోడుతో లారీలు వే బిల్లులు లేకుండా వెళుతున్నాయని ఇందులో మంత్రి పొన్నం ప్రభాకర్ హస్తం ఉందని కౌశిక్ రెడ్డి ఆరోపణలు చేశారు. మంత్రి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని తన దగ్గర ఆధారాలు ఉన్నాయని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపణలు చేయగా ఇది కేవలం పబ్లిసిటీ కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అంటున్నారు ప్రణవ్. కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే కాక ముందు నియోజకవర్గంలో కొంత మంది యువకుల వద్ద ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశారని గుర్తుచేశారు.చెల్పూర్ హనుమాన్ ఆలయం వద్ద ఆధారాలతో నిరూపిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ప్రణవ్ సవాల్ విసిరారు.

# ప్రచారంలో నీతులు.. ప్రభుత్వంలోకి వచ్చాక నీతిమాలిన పనులా..? రేవంత్‌పై ధ్వజమెత్తిన కేటీఆర్



హైదరాబాద్ : పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్న రేవంత్ తీరును ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎండగట్టారు. ప్రచారంలో నీతులు మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ప్రభుత్వంలోకి వచ్చాన నీతిమాలిన పనులు చేస్తున్నారని విమర్శించారు. ఒక పార్టీ తరపున గెలిచి మరో పార్టీలో చేరడం నేరం. ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టిచంపమన్నారు. రాజీనామా చేయకుండా ఇతర పార్టీల్లో చేరితే ఊళ్లనుంచే తరిమికొట్టమన్నారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డినే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఏ ఎమ్మెల్యేనైనా రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిస్తే.. రాళ్లతో కొట్టించే బాధ్యత తీసుకుంటా అన్నది మీరే. అందుకే జవాబు చెప్పాల్సింది కూడా మీరే అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు.

## రాగల ఐదురోజులు భారీ వర్షాలే..!

# హెచ్చరించిన ఐఎండీ



హైదరాబాద్: తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లోకి వానలు కురుస్తాయని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం నుంచి గురువారం వరకు నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో వర్షాలు పడుతాయని పేర్కొంది. ఇక గురువారం నుంచి శుక్రవారం వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని వివరించింది.

# ఇంజినీరింగ్ విద్యార్థులకు అలెర్ట్..

## కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు..!



హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో బీటెక్, బీఈ సీట్ల భర్తీకి కోసం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో మార్పులు చోటు చేసుకున్నది. షెడ్యూల్ ప్రకారం.. ఈ నెల 27 నుంచి మొదలు కావాల్సిన కౌన్సెలింగ్ వాయిదాపడింది. మళ్లీ జూలై 4 నుంచి ఇంజినీరింగ్ తొలివిడత ప్రక్రియ మొదలవనున్నది. జూలై 6 నుంచి 13 వరకు తొలి విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్, 8వ తేదీ నుంచి 15 వరకు తొలి విడత వెబ్ ఆప్షన్స్, 19న ఇంజినీరింగ్ తొలి విడత సీట్లను కేటాయించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక జూలై 26 నుంచి ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని.. 27న రెండో విడత కౌన్సెలింగ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జూలై 27, 28 తేదీల్లో రెండో విడత వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఇస్తామని.. 31న రెండో విడత సీట్ల కేటాయింపు, ఆగస్ట్ 8 నుంచి మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్ట్ 9న మూడో విడత కౌన్సెలింగ్‌కు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి.. 9, 10 తేదీల్లో వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే నెల 13న ఇంజినీరింగ్ మూడో విడత సీట్ల కేటాయించనున్నారు. ఇక ఆగస్టు 21 నుంచి కన్వీనర్ కోటా ఇంటర్నల్ స్లైడింగ్ ఉండనున్నది.

## ఆసరా పింఛన్లు పెంచాలని రోడ్డెక్కిన వృద్ధులు.. భారీగా ట్రాఫిక్ జాం



జోగుళాంబ గద్వాల : పింఛన్ పెంచి ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఊసే ఎత్తడం లేదని పండుటాకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గద్వాల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. రేవంత్ సర్కారు వచ్చాక నెల ముగుస్తున్నా పింఛన్ డబ్బులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ. 2 వేలు ఉన్న పింఛన్‌ను రూ. 4 వేలు, రూ. 4 వేలు ఉన్న దివ్యాంగులకు పింఛన్ రూ. 6 వేలు అందిస్తామని ప్రకటించిన తర్వాత రేవంత్ సీఎం అయి ఏడు నెలలు కావస్తున్నా ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో నెలనెలా మొదటి వారంలోనే పింఛన్లు చేతికి అందేవని గుర్తు చేశారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com